


PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ‖సంపుటి:1 ‖ సంచిక: 96‖ సోమవారం ‖ 31-8-2026 ‖ పేజీలు: 8 ‖ వెల 3/-





31 ఆగస్టు 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:05 సూర్యాస్తమయం - సా. 6:27 తిథి తదియ ఉ. 8:50 వరకు తరువాత చవితి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం రేవతి తె. 3:23o వరకు తరువాత అశ్విని యోగం గండ రా. 1:45o వరకు కరణం విష్టి ఉ. 8:50 వరకు బవ రా. 8:16 వరకు వర్జ్యం మ. 3:33 నుండి సా. 5:08 వరకు దుర్ముహూర్తం మ. 12:41 నుండి మ. 1:30 వరకు మ. 3:09 నుండి మ. 3:58 వరకు రాహుకాలం ఉ. 7:38 నుండి ఉ. 9:11 వరకు యమగండం ఉ. 10:43 నుండి మ. 12:16 వరకు గుళికాకాలం మ. 1:49 నుండి మ. 3:21 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:29 నుండి తె. 5:17 వరకు అమృత ఘడియలు రా. 1:00 నుండి రా. 2:35 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:51 నుండి మ. 12:41 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



## భారత్-ఉజ్బెకిస్తాన్ సంబంధాలకు..

# కొత్త దిశ



### సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా అప్‌గ్రేడ్

### 2030 నాటికి 5 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యం

**మౌలిక వసతులు, కృత్రిమ మేధలో సహకారం విస్తరణ.. ప్రధాని నరేంద్ర మోదీ**

భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్కత్ మీర్జియోయేవ్ మధ్య తాష్కెంట్‌లో జరిగిన ద్వైపాక్షిక చర్చలు కీలక ఫలితాలను ఇచ్చాయి. ఇరు దేశాల మధ్య ఉన్న సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తూ వాటిని సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం ద్వారా రాజకీయ, ఆర్థిక, సాంకేతిక, భద్రతా రంగాల్లో సహకారం మరింత బలోపేతం కానుంది. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని విస్తరించేందుకు ఇరు దేశాలు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికపై దృష్టి సారించాయి.



## నర్సు మృతి కేసులో

# పురోగతి

పహాడీషరీఫ్: హైదరాబాద్ పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన నర్సు (21) కేసులో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. ఆమెను బిహార్ వాసి హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. సైనా ఉల్లా అనే వ్యక్తి కిటికీ నుంచి నర్సు గదిలోకి దూకి.. ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. బాధితురాలు ప్రతిఘటించగా.. గొంతు నొక్కి కేకలు వేయకుండా అడ్డుకోవడంతో ఆమె మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు పారిపోతుండగా పట్టుకుని.. విచారించగా నేరం (మిగతా 2వ పేజీలో)




## భవిష్యత్ పరిశ్రమలకు నైపుణ్యం అవసరం

**పీఎం-సేతు సదస్సులో రాజ్‌నాథ్ సింగ్**

**స్వయం ఉపాధికి కొత్త అవకాశాలు**

**పరిశ్రమలతో శిక్షణ సంస్థల భాగస్వామ్యం**

**లక్నో, ఆగస్టు 30 :** దేశ రక్షణ తయారీ, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, డ్రోన్లు, రోబోటిక్స్, ఆధునిక తయారీ రంగాల్లో భారత్ వేగంగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు కలిగిన యువశక్తిని తీర్చిదిద్దడం అత్యంత కీలకమని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించిన పీఎం-సేతు పరిశ్రమల సదస్సులో ఆయన ప్రసంగించారు. దేశ అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో నైపుణ్యాభివృద్ధి కీలక పాత్ర పోషిస్తోందని రాజ్‌నాథ్ సింగ్ (మిగతా 2వ పేజీలో)



## మోటమర్రిలో గోదాం ప్రారంభం..

# రోడ్లకు శంకుస్థాపన

**రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధే లక్ష్యమన్న ఉప ముఖ్యమంత్రి**

బోనకల్ మండలం మోటమర్రి గ్రామంలో రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎన్‌సీడీసీ పథకం కింద పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్మించిన గోదామును ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించారు. రూ.24.50 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ గోదాం 300 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో రైతులకు ఉపయోగపడనుంది.

ఖమ్మం, ఆగస్టు 30: ఈ సందర్భంగా గోదాం భవనాన్ని ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి, వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. పంటలను సురక్షితంగా నిల్వ చేసుకునే అవకాశంతో రైతులు మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా విక్రయాలు చేసుకునే వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. అనంతరం మోటమర్రి ఎస్సీ కాలనీలో రూ. 1 కోటి వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ (మిగతా 2వ పేజీలో)

# వెలిగొండ..

## రైతన్నకు భరోసా

'వెలిగొండ ఒక ప్రాజెక్టు మాత్రమే కాదు.. కరవుతో పోరాడిన రైతన్నకు భరోసా. ఫ్లోరైడ్ బాధిత కుటుంబాలకు ఆరోగ్య భద్రత. వలస వెళ్లిన యువతకు సొంతగడ్డపై భవిష్యత్తు. పేదరికంలో మగ్గిన ప్రాంతానికి ప్రగతి మార్గం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.



**అమరావతి, ఆగస్టు 30 :** వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను పూర్తిచేసి సోమవారం ప్రారంభోత్సవం చేయడం ద్వారా మూడు దశాబ్దాల నిరీక్షణకు ముగింపు పలికినట్లవుతుందని ఆదివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. 'మూడు జిల్లాల్లో లక్షల మంది ప్రజల భవిష్యత్తుకు తొలి అడుగు. మార్కాపురం జిల్లా గడ్డపై కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోంది. కరవు పీడిత ప్రాంత ప్రజల 30 ఏళ్ల వెలిగొండ కల.. (మిగతా 2వ పేజీలో)

# కేరళలో చికిత్స.. ఏపీలో పాలన

## ఫైళ్లపై సమీక్ష.. నిర్ణయాల్లో వేగం

**ప్రజా సమస్యలపై పవన్ నిరంతర పర్యవేక్షణ**

**పర్యావరణం నుంచి పుణ్యక్షేత్రాల వరకు ప్రత్యేక దృష్టి**

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వైద్య చికిత్స నిమిత్తం కేరళలో ఉన్నప్పటికీ ప్రభుత్వ వ్యవహారాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఈ నెల 22న చికిత్స కోసం కేరళకు వెళ్లిన ఆయన అక్కడి నుంచే శాఖల పనితీరును సమీక్షిస్తూ, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా సమావేశాలు నిర్వహిస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ అవసరమైన చోట అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నారు.

**అమరావతి, ఆగస్టు 30 :** రాష్ట్రంలోని ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధి కోసం చేపట్టిన "గుడి బాట" కార్యక్రమాన్ని పవన్ కళ్యాణ్ సమీక్షించారు. 100కు పైగా పుణ్యక్షేత్రాలకు 205 కిలోమీటర్ల రహదారులను రూ. 120 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. పనులు పూర్తయిన తర్వాత నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి మాత్రమే భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే పుట్టపర్తి ప్రాంతంలో ఆలయ రహదారుల అభివృద్ధికి మరో రూ. 30 కోట్లు మంజూరు చేయాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న "గ్రేట్ గ్రీన్ వాల్" కార్యక్రమంపై కూడా ఆయన సమీక్ష నిర్వహించారు. 5,499 హెక్టార్లలో 55 లక్షల తాటి విత్తనాలను నాటే లక్ష్యంతో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. విత్తనాల సేకరణ, నాటడం, సంరక్షణ అంశాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పచ్చదనం తరువాయి 2 వ పేజీలో...



# రష్యాకు పెట్రోల్ పంపుతున్న భారత్

అంతర్జాతీయ ఇంధన మార్కెట్లో అరుదైన పరిణామం చోటుచేసుకుంది. సాధారణంగా ముడి చమురు కోసం రష్యాపై ఆధారపడే భారత్, ఇప్పుడు అదే రష్యాకు పెట్రోల్ ఎగుమతి చేసే కీలక దేశంగా అవతరించింది. ఉక్రెయిన్ డ్రోన్ దాడుల తో రష్యాలోని పలు చమురు శుద్ధి కర్మాగారాలు తీవ్రంగా దెబ్బతినడంతో అక్కడ ఇంధన ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది.

ఈ పరిస్థితుల్లో దేశీయ అవసరాలను తీర్చుకోవడానికి రష్యా విదేశాల నుంచి పెట్రోల్ దిగుమతులపై ఆధారపడాల్సి వచ్చింది. ఈ పరిణామం ప్రపంచ ఇంధన రంగంలో భారత్ ప్రాధాన్యాన్ని మరింత పెంచినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. వోర్టెక్సా అనే అంతర్జాతీయ ఎనర్జీ అనలిటిక్స్ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం గత రెండు నెలల్లో రష్యా రిఫైనరీలపై సుమారు 32 డ్రోన్ దాడులు జరిగాయి. ఈ దాడుల ప్రభావంతో దేశీయ పెట్రోల్ ఉత్పత్తి దాదాపు 70 శాతం మేర తగ్గిపోయినట్లు అంచనా వేస్తున్నారు. ఫలితంగా రష్యాలోని అనేక నగరాల్లో పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. ఇంధన కొరతతో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు రష్యా ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై ఆంక్షలు విధించింది. ఈ సంక్షోభ సమయంలో భారత్ రష్యాకు అండగా నిలిచింది. జులై, ఆగస్టు నెలల్లో భారత్ నుంచి 10 లక్షల బ్యారెళ్ల పెట్రోల్ రష్యాకు ఎగుమతి అయినట్లు వర్గాలు వెల్లడించాయి.

# నేటి రాశి ఫలాలు

మేషం: ఉద్యోగయత్నాలు మందకొడిగా సాగుతాయి. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత కలుగుతుంది. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడులు పెరుగుతాయి. ఆలయ దర్శనాలు చేసుకుంటారు. వ్యాపార, ఉ ద్యోగాలలో కొన్ని సమస్యలు తప్పవు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి.

వృషభం: చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. వ్యాపారాలలో ఒడిదుడుకులు అధికమవుతాయి. సన్నిహితుల నుంచి కీలక సమాచారం అందుతుంది. నూతన ఋణాలు చేస్తారు. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు నిలకడగా ఉండవు. ఉ ద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

మిధునం: వ్యయప్రయాసలతో కాని పనులు పూర్తి కావు. దూరపు బంధువుల నుండి ఆసక్తికర సమాచారం సేకరిస్తారు. బంధువులతో వివాదాలు చికాకు పరుస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో బాధ్యతలు పెరుగుతాయి. కొన్ని వ్యవహారాలలో ఆకస్మికంగా నిర్ణయాలు మార్చుకుంటారు. ఆర్థిక పరిస్థితి అంతగా అనుకూలించదు.

కర్కాటకం: ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. చేపట్టిన పనులలో శ్రమ అంతగా ఫలించదు. బంధువులతో వివాదాలు తప్పవు. మిత్రులతో మాటపట్టింపులు ఉ ంటాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో చికాకులు పెరుగుతాయి. పాత ఋణాలు తీర్చడానికి నూతన ప్రయత్నాలు చేస్తారు. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది.

సింహం: సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. దూరపు బంధువుల కలయిక ఆనందం కలిగిస్తుంది. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. వ్యాపారాలు లాభాల బాట పడతాయి. ఉ ద్యోగాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. విందువినోదాది కార్యక్రమాల్లో పాల్గొంటారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి అవుతాయి.

కన్య: వ్యాపార, ఉద్యోగాలలో సమస్యాత్మక వాతావరణం ఉ ంటుంది. కుటుంబ సభ్యులతో వివాదాలు పరిష్కారం అవుతాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనులు మందగిస్తాయి. దూరపు బంధువులను కలుసుకుంటారు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. దైవదర్శనాలు చేసుకుంటారు.

తుల: ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఇంటా బయట ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. మొండి బాకీలు వసూలవుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో ప్రోత్సాహకర వాతావరణం ఉంటుంది. సన్నిహితులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాదిస్తారు.

వృశ్చికం : రాజకీయ ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. దీర్ఘకాలిక వివాదాలు పరిష్కారవుతాయి. ఆకస్మిక ధన లాభ సూచనలు ఉ న్నవి. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులతో పాత జ్ఞాపకాలను పంచుకుంటారు.

ధనస్సు: దైవచింతన పెరుగుతుంది. ఖర్చుల విషయంలో పునరాలోచన చేయడం మంచిది. ముఖ్యమైన పనుల్లో ఊహించని ఆటంకాలు కలుగుతాయి. వ్యాపార ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి. నూతన ఋణప్రయత్నాలు చేస్తారు. ఆత్మీయులతో చిన్నపాటి వివాదాలు తప్పవు.

మకరం: వ్యాపార వ్యవహారాల్లో పెద్దల సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. ముఖ్యమైన వ్యవహారాలు నిదానంగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో కొన్ని వివాదాలు చికాకు పరుస్తాయి. ఉ ద్యోగాలలో కొత్త సమస్యలు ఎదురవుతాయి. ఆర్థిక పరిస్థితి నిరాశ పరుస్తుంది. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది.

కుంభం: నూతన వాహనయోగం ఉన్నది. విద్యార్థులు పోటీపరీక్షల్లో విజయం సాధిస్తారు. వృత్తి వ్యాపారాలలో ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. వ్యాపార ఉద్యోగాలలో నూతన ఆశలు చిగురిస్తాయి. సన్నిహితుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆర్థిక లావాదేవీలు ప్రోత్సాహకరంగా సాగుతాయి.

మీనం: నూతన వాహన యోగం ఉన్నది. సమాజంలో పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయం అవుతుంది. స్థిరాస్తి కొనుగోలుకు ఆటంకాలు తొలగుతాయి. వ్యాపార విస్తరణకు అవరోధాలు తొలగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో శు భకార్యాలలో పాల్గొంటారు. మొండి బాకీలు వసూలవుతాయి.



# సిద్ధాంతాలతో ముందుకెళ్తున్న బీజేపీ ప్రయాణం

మేడ్చల్, ఆగస్టు 30: మేడ్చల్ మల్కాజిగిరి (అర్బన్) జిల్లా అధ్యక్షుడిగా నూత నంగా ఎన్నికైన డి.గిరివర్ధన్ రెడ్డి పదవీ బాధ్యతల స్వీకరణ మహోత్సవం, జిల్లా పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుతో కలిసి ఎంపీ ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన పార్టీ సిద్ధాంతాలు, దేశాభివృద్ధి, స్వాతంత్ర్య ఉద్యమం, బీజేపీ రాజకీయ ప్రస్థానంపై విస్తృతంగా మాట్లాడారు. భారతీయ జనతా పార్టీ ఒక వ్యక్తి లేదా కుటుంబానికి చెందిన పార్టీ కాదని, దేశ హితం ప్రధాన లక్ష్యంగా ఏర్పడిన సిద్ధాంత పార్టీ అని స్పష్టం చేశారు. సభలో మాట్లాడిన ఈటెల రాజేందర్, "దేశం ఫస్ట్, పార్టీ నెక్స్ట్, వ్యక్తిగతం లాస్ట్" అనే భావజాలమే బీజేపీ మూల సిద్ధాంతమని పేర్కొన్నారు. పార్టీ తీసుకునే ప్రతి నిర్ణయం దేశ ప్రయోజనాల కోసమే ఉంటుందని, స్వప్రయోజనాల కోసం కాదని చెప్పారు. బీజేపీ ఎన్నికల కోసం మాత్రమే పనిచేసే పార్టీ కాదని, ప్రజల అవసరాలు, దేశ అభివృద్ధి, సామాజిక మార్పుల కోసం నిరంతరం కృషి చేసే ప్రజా కేంద్రిత రాజకీయ సంస్థ అని వివరించారు.



ఈ నేపథ్యంలో కొత్త జిల్లా అధ్యక్షుడి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. దేశం 80వ స్వాతంత్ర్య వేడుకలు జరుపుకుంటున్న తరుణంలో గత చరిత్రను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఈటెల పేర్కొన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వం దేశ మౌలిక వసతుల అభివృద్ధికి బలమైన పునాదులు వేసిందన్నారు. స్వర్ణ చతుర్భుజి జాతీయ రహదారి ప్రాజెక్టు, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన వంటి కార్యక్రమాలు దేశ ఆర్థికాభి వృద్ధికి, గ్రామీణ ప్రాంతాల అనుసంధానానికి ఎంతగానో దోహదపడ్డాయని చెప్పారు. సంకీర్ణ ప్రభుత్వ పరిమితులు ఉన్నప్పటికీ దేశ ప్రయో జనాలే లక్ష్యంగా వాజ్‌పేయి పనిచేశారని కొనియాడారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని ఈటెల తెలిపారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం దశాబ్దాల కల సాకార మైందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల ఆకాంక్షను నెరవేర్చడంలో మోదీ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందన్నారు. రామమందిర ఉద్యమం వెనుక ఉన్న నాయకుల త్యాగాలు, కృషిని కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370 రద్దు దేశ సమైక్యతకు బలమైన నిర్ణయమని ఈటెల అభిప్రాయపడ్డారు. దేశానికి ఒకే జెండా, ఒకే చట్టం ఉండాలనే శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆకాంక్షను మోదీ ప్రభుత్వం కార్యరూపం దాల్చిందన్నారు.

# గొల్లపల్లి అభివృద్ధికి కార్యాచరణ

కరీంనగర్, ఆగస్టు 30 :

గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి త్వరలోనే నీటిని విడుదల చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తయితే రైతాంగానికి గణనీ యమైన ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గొల్లపల్లికి ఓపెన్ జిమ్, వాటర్ ప్లాంట్ మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని చెప్పారు. గ్రామంలో స్థల సేకరణ పూర్తయిన వెంటనే గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు, మహి ళా భవనానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి పంటలు, ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. నీటి సంరక్షణ కోసం ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. నీటి వనరుల పరిరక్షణ ద్వారా భవిష్యత్ తరాలకు ఉపయోగకరమైన వాతావరణాన్ని కల్పించవచ్చని పేర్కొన్నారు. గ్రామ యువత క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందని మంత్రి తెలిపారు. అవసరమైన క్రీడా సామగ్రిని అందించడంతో పాటు క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుం టామని చెప్పారు. యువత శారీరక దృఢత్వంతో పాటు క్రీడా రంగంలో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. ప్ర జా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గొ ల్లపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.

# మోటమర్రిలో గోదాం ప్రారంభం.. రోడ్లకు శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)



రోడ్ల నిర్మాణ పనులకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. కాలనీలో రహదారుల సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్, వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పనతో గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. రైతుల సంక్షేమం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కోసం అవసరమైన నిధులను ప్రభుత్వం సమకూరుస్తోందని చెప్పారు. సహకార రంగాన్ని బలోపేతం చేస్తూ రైతులకు మరిన్ని సౌకర్యాలు అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. మోటమర్రి గ్రామంలో చేపట్టిన ఈ అభివృద్ధి పనులు స్థానిక ప్రజలకు, రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారనున్నాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గ్రామీణ మౌలిక వసతుల విస్తరణ ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# భారత్-ఉజ్బెకిస్తాన్ సంబంధాలకు కొత్త దిశ

తాష్కెంట్, ఆగస్టు 30 :

ప్రస్తుతం ఉన్న వాణిజ్య స్థాయిని గణనీయంగా పెంచుతూ 2030 నాటికి 5 బిలియన్ డాలర్లకు పైగా వాణిజ్య లక్ష్యాన్ని చేరుకోవాలని నిర్ణయించారు. ఇందుకోసం వ్యాపార, పెట్టుబడి అవకాశాలను పెంపొందించడంతో పాటు కొత్త రంగాల్లో భాగస్వామ్యాన్ని విస్తరించేందుకు అంగీకరించారు. మౌలిక వసతుల అభివృద్ధి, డిజిటల్ ప్రజా సేవల వ్యవస్థ, కృత్రిమ మేధ, కీలక ఖనిజాలు, ఇంధన రంగం, అంతరిక్ష పరిశోధన వంటి భవిష్యత్ అవసరాలకు సంబంధించిన రంగాల్లో సహకారాన్ని మరింత పెంచాలని చర్చల్లో నిర్ణయించారు. ఈ రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాల మార్పిడి ద్వారా పరస్పర ప్రయోజనాలు పొందే అవకాశాలు ఉన్నాయని ఇరు దేశాల నాయకులు అభిప్రాయపడ్డారు. వ్యాపారవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు మార్కెట్



ప్రాప్యతను మెరుగుపరచడంపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. రవాణా అనుసంధానం, వాణిజ్య మార్గాల విస్తరణ, బ్యాంకింగ్ సేవల బలోపేతం, చెల్లింపు వ్యవస్థల అనుసంధానం వంటి అంశాలపై ఇరు దేశాలు కార్యాచరణ చేపట్టనున్నాయి. దీనివల్ల ద్వైపాక్షిక వాణిజ్యానికి మరింత ఊతం లభించనుంది. భారత్, ఉజ్బెకిస్తాన్ మధ్య చారిత్రక, సాంస్కృతిక సంబంధాలు ఉ న్నప్పటికీ ఇటీవల సంవత్సరాల్లో ఆర్థిక, వ్యూహాత్మక సహకారం కూడా వేగంగా విస్తరిస్తోంది. మధ్య ఆసియాలో భారత్ ప్రభావాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ ఒప్పందాలు కీలకంగా మారనున్నాయి. అదే సమయంలో ఉజ్బెకిస్తాన్‌కు కూడా భారత మార్కెట్, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కొత్త అవకాశాలు లభించనున్నాయి. తాష్కెంట్ చర్చల ఫలితంగా ఇరు దేశాల సంబంధాలు కొత్త దశలోకి ప్రవేశించాయని అధికారులు పేర్కొన్నారు. సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, ఇంధనం, అంతరిక్షం సహా అనేక రంగాల్లో సహకారం మరింత విస్తరించనుంది. రాబోయే సంవత్సరాల్లో భారత్--ఉజ్బెకిస్తాన్ సంబంధాలు మరింత బలపడే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ... ఏపీలో పాలన

మొదటి పేజీ తరువాయి

పెంపు కోసం రూపొందించిన ఏపీ-గ్రీన్ కార్యాచరణను వేగవంతం చేయాలని సూచించారు. 2047 నాటికి రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించే లక్ష్యంతో జీఐఎస్, జియో ట్యాగింగ్, అగ్రో ఫారెస్ట్రీ, అవెన్యూ ప్లాంటేషన్స్, కాలువ గట్లు, షెల్టర్ బెల్ట్స్, నర్సరీల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సిఎస్ఆర్, నాబార్డ్, కార్బన్ ఫైనాన్స్ వంటి వనరులను వినియోగించుకుని నెలవారీ, త్రైమాసిక లక్ష్యాలతో పనులను పర్యవేక్షించాలని సూచించారు. అలాగే ఆదివాసీ ప్రాంతాల్లో "అడవి తల్లి బాట" కార్యక్రమం ద్వారా రహదారి కనెక్టివిటీని మరింత విస్తరించాలని ఆదేశించారు.

పిఠాపురం నియోజకవర్గంలో ఆధ్యాత్మిక, ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి సారించారు. 24 ఆలయాల పునరుద్ధరణకు రూ.17.06 కోట్లు, టీటీడీ కళ్యాణ మండపానికి రూ.2 కోట్లు, 48 భజన మందిరాల నిర్మాణానికి రూ.11.60 కోట్లు కేటాయించేలా చర్యలు తీసుకున్నారు. అలాగే పిఠాపురంలోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను రూ.34 కోట్లతో 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేసే పనులను సమీక్షించారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.36.6 కోట్లతో ఏర్పాటు చేస్తున్న క్యాన్సర్ కేంద్రం పనుల పురోగతినీ పరిశీలించారు. అనకాపల్లి జిల్లా కృష్ణంపాలెంలో కాలుష్యంపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి కాలుష్య నియంత్రణ మండలి ద్వారా తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు అనుగుణంగా కాలుష్య నియంత్రణ పరికరాలు ఏర్పాటు చేసే వరకు పరిశ్రమను పునఃప్రారంభించరాదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ పరిణామాలన్నింటినీ పరిశీలిస్తే, చికిత్స కోసం రాష్ట్రానికి దూరంగా ఉన్నప్పటికీ పరిపాలనపై పవన్ కళ్యాణ్ నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారనే విషయం స్పష్టమవుతోందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

# వెలిగొండ.. రైతన్నకు భరోసా

(మొదటి పేజీ తరువాయి)

కృష్ణమ్మ జలాలతో నిజం కాబోతోంది. 1996లో ప్రాజెక్టును మొదలు పెట్టిన నేనే.. ఇప్పుడు ప్రారంభోత్సవం చేయనుండడం భావోద్వేగానికి గురిచేస్తోంది' అని చంద్రబాబు పేర్కొన్నారు. 'ఈ మహాయజ్ఞం కోసం తమ భూములు, ఇళ్లు, పుట్టి పెరిగిన ఊళ్లను త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసితులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను' అని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కడప జిల్లాల్లోని రైతుల జీవితాల్లో వెలిగొండ ప్రాజెక్టు వెలుగులు నింపనుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఇది కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదని.. తరతరాలుగా కరవుతో పోరాడిన రైతులకు భరోసా అని ఆదివారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 1996లో వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు.. నేడు దాన్ని జాతికి అంకితం చేయడం అరుదైన ఘటనని తెలిపారు. సీఎం చంద్రబాబు వల్లే వెలిగొండ ప్రాజెక్టు సాకారమైందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. వైకాపా ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిగా గాలికొదిలేసిందని ఆదివారం ఆయన ఓ ప్రకటనలో మండిపడ్డారు.

## తెలంగాణ ప్రత్యేకత ఉట్టిపడేలా

# గోదావరి పుష్కరాలు

హైదరాబాద్, ఆగస్టు 30 :

గోదావరి పుష్కరాలను తెలంగాణ ప్రత్యేక గుర్తింపు, సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. భక్తులకు కల్పించే సౌకర్యాలు ఆధ్యాత్మిక అనుభూతిని అందించడంతోపాటు తెలంగాణ ఆతిథ్య వైభవం, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా ఉండాలని సూచించారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు తెలంగాణలో నిర్వహించనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్ల సమన్వయం కోసం హైదరాబాద్‌లో ని ప్రజాభవన్ మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన ప్రత్యేక అధికారి కార్యాలయాన్ని మంత్రి ఆదివారం ప్రారంభించారు. అనంతరం దేవాదాయ శాఖ అధికా రులతో కలిసి కార్యాలయంలోని విభాగాలను పరిశీలిం చి, నూతన సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహిం చారు. గోదావరి పుష్కరాలంటే ఇప్పటివరకు ప్రధానం గా రాజమహేంద్రవరం గుర్తుకు వచ్చేదని, ఈసారి తెలంగాణను కూడా పుష్కరాలకు ప్రత్యేక గమ్యస్థానంగా నిలిపేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగాలు, స్థానిక సంస్థలు, దేవాదాయ శాఖ మధ్య సమన్వయానికి ప్రత్యేక అధికారి కార్యాలయం కేంద్రంగా పనిచేస్తుందని తెలిపారు. భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉ న్నందున మౌలిక వసతులు, స్నానఘట్టాల నిర్మాణం, అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీరు, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, వైద్య సేవలు, నిరంతర విద్యుత్ సరఫరా తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. పనుల పురోగతిపై క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాల ఘన నిర్వహణకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి 1,000 కోట్లు మంజూ రు చేయడాన్ని మంత్రి స్వాగతించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, ఆర్జేసీ రామకృష్ణారావు, డీసీ కృష్ణప్రసాద్, అధికారులు, ఉద్యోగులు, ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# శ్వేత

## సంపాదకీయం

**సోమవారం 31-8-2026**

## మత్తు వ్యసనంపై మానవాళికి హెచ్చరిక

ప్రతి సంవత్సరం ఆగస్టు 31న నిర్వహించే ఇంటర్నేషనల్ ఓవర్‌డోస్ అవేర్‌నెస్ డే కేవలం ఒక అవగాహన కార్యక్రమం మాత్రమే కాదు. మత్తు పదార్థాల వినియోగం ఎంతటి విషాదాలకు దారితీస్తుందో ప్రపంచానికి గుర్తుచేసే హెచ్చరిక దినం. ఓవర్‌డోస్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన లక్షలాది మందిని స్మరించుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి మరణాలను నివారించేందుకు సమాజం తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించే సందర్భం కూడా ఇదే. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత సమస్య కాదని, అది కుటుంబాలు, సమాజం, దేశాల అభివృద్ధిని ప్రభావితం చేసే సామాజిక సమస్య అని ఈ రోజు స్పష్టంగా తెలియజేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా మత్తు పదార్థాల వినియోగం ఆందోళనకర స్థాయిలో పెరుగుతోంది. ముఖ్యంగా యువతలో వ్యసనాల ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. జీవితంలో ఎదురయ్యే ఒత్తిడులు, మానసిక సమస్యలు, చెడు స్నేహాలు, సామాజిక ప్రభావాలు, ఆసక్తి వంటి కారణాలతో చాలామంది యువకులు మత్తు పదార్థాల వైపు ఆకర్షితులవుతున్నారు. ఒకసారి వ్యసనానికి బానిసైన తర్వాత దాని నుంచి బయటపడటం చాలా కష్టంగా మారుతోంది. ఈ పరిస్థితి కుటుంబాలకు తీవ్ర ఆందోళన కలిగించడమే కాకుండా సమాజ భవిష్యత్తును కూడా ప్రశ్నార్థకంగా మారుస్తోంది.

ఓవర్‌డోస్ అనేది కేవలం అధిక మోతాదులో మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే శారీరక సమస్య మాత్రమే కాదు. అది ఒక వ్యక్తి జీవితాన్ని ఒక్క క్షణంలో ముగించే ప్రమాదకర పరిస్థితి. శ్వాసకోశ వ్యవస్థ పనిచేయకపోవడం, గుండె స్పందనలో లోపాలు, మెదడు కార్యకలాపాలు నిలిచిపోవడం వంటి సమస్యలు ఓవర్‌డోస్ సమయంలో సంభవిస్తాయి. సమయానికి వైద్య సహాయం అందకపోతే ప్రాణాలు కోల్పోయే అవకాశం చాలా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఓవర్‌డోస్ లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించడం అత్యంత అవసరం. వ్యసనాల ప్రభావం వ్యక్తి ఆరోగ్యానికే పరిమితం కాదు. ఒక వ్యక్తి మత్తు పదార్థాలకు బానిసైతే అతని కుటుంబం కూడా తీవ్ర మానసిక, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటుంది. కుటుంబ సంబంధాలు దెబ్బతింటాయి. ఉద్యోగాలు, విద్య, వ్యక్తిగత అభివృద్ధి వంటి అంశాలు ప్రభావితమవుతాయి. కొన్నిసార్లు నేరాలకు కూడా వ్యసనాలు కారణమవుతాయి. అందుకే మాదకద్రవ్యాల సమస్యను కేవలం చట్టపరమైన అంశంగా కాకుండా సామాజిక, ఆరోగ్య, మానసిక కోణాల్లో కూడా చూడాల్సిన అవసరం ఉంది.ప్రపంచంలోని అనేక దేశాలు మాదకద్రవ్యాల నియంత్రణ కోసం కఠిన చర్యలు చేపడుతున్నాయి. అయినప్పటికీ అక్రమ రవాణా, ఆన్‌లైన్ నెట్‌వర్క్‌లు, అంతర్జాతీయ ముఠాల కారణంగా ఈ సమస్య పూర్తిగా అదుపులోకి రావడం లేదు. మత్తు పదార్థాల లభ్యత పెరగడం యువతను మరింత ప్రమాదంలోకి నెడుతోంది. అందుకే ప్రభుత్వాలు చట్టాలను కఠినతరం చేయడంతో పాటు విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు, కుటుంబాలు కూడా ఈ పోరాటంలో భాగస్వాములు కావాలి. మత్తు పదార్థాల వ్యసనాన్ని చాలా మంది ఇంకా ఒక నేరంగా లేదా వ్యక్తిగత వైఫల్యంగా చూస్తున్నారు. కానీ వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం ఇది ప్రధానంగా ఒక ఆరోగ్య సమస్య. వ్యసనానికి గురైన వ్యక్తులకు విమర్శలు కాకుండా సరైన చికిత్స, కౌన్సెలింగ్, మానసిక మద్దతు అవసరం. సమాజం వారిని దూరం పెట్టకుండా పునరావాసం కోసం ప్రోత్సహించాలి. అలా చేసినప్పుడే వారు తిరిగి సాధారణ జీవితంలోకి రావడానికి అవకాశం ఉంటుంది. ఇంటర్నేషనల్ ఓవర్‌డోస్ అవేర్‌నెస్ డే మరో ముఖ్యమైన విషయాన్ని గుర్తుచేస్తుంది. అది అవగాహన శక్తి. చాలా సందర్భాల్లో ప్రజలకు సరైన సమాచారం లేకపోవడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయి.

ఓవర్‌డోస్ లక్షణాలు ఏమిటి, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, ఎక్కడ సహాయం పొందాలి వంటి విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తే అనేక ప్రాణాలను కాపాడవచ్చు. విద్యాసంస్థలు, ఆరోగ్య సంస్థలు, మీడియా ఈ విషయంలో మరింత చురుకుగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం డిజిటల్ యుగంలో యువత ఎక్కువ సమయం ఆన్‌లైన్‌లో గడుపుతోంది. ఈ పరిస్థితిని సానుకూలంగా ఉపయోగించుకుని సోషల్ మీడియా, డిజిటల్ వేదికల ద్వారా వ్యసనాల ప్రమాదాలపై విస్తృత ప్రచారం నిర్వహించవచ్చు. నిజ జీవిత కథనాలు, నిపుణుల సూచనలు, పునరావాసం పొందిన వారి అనుభవాలు యువతపై ప్రభావం చూపగలవు. మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాన్ని వారికి స్పష్టంగా వివరించడం ద్వారా వ్యసనాలకు దూరంగా ఉంచే అవకాశం ఉంటుంది. ఈ దినోత్సవం సందర్భంగా ఓవర్‌డోస్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకోవడం కూడా ముఖ్యమైన అంశం. ప్రతి మరణం వెనుక ఒక కుటుంబం, ఒక జీవితం, ఒక భవిష్యత్తు దాగి ఉంటుంది. ఆ నష్టాన్ని ఎప్పటికీ భర్తీ చేయలేం. కానీ అలాంటి విషాదాలు మరెవరికి జరగకుండా చర్యలు తీసుకోవడం ద్వారా వారి జ్ఞాపకాలకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుంది. అందుకే ఈ రోజు సంతాపంతో పాటు బాధ్యతను కూడా గుర్తు చేస్తుంది. మొత్తంగా ఇంటర్నేషనల్ ఓవర్‌డోస్ అవేర్‌నెస్ డే ప్రపంచ సమాజానికి ఒక బలమైన సందేశాన్ని అందిస్తోంది. మత్తు పదార్థాలపై పోరాటం కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు. కుటుంబాలు, విద్యాసంస్థలు, వైద్య రంగం, మీడియా, సామాజిక సంస్థలు, యువత---అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. అవగాహన, చికిత్స, పునరావాసం, మద్దతు అనే నాలుగు స్తంభాలపై ఈ పోరాటం కొనసాగితేనే ఓవర్‌డోస్ మరణాలను తగ్గించడం సాధ్యమవుతుంది. ప్రాణాల విలువను గుర్తిస్తూ, వ్యసన రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలనే సందేశాన్ని ఈ ప్రత్యేక దినం ప్రపంచానికి అందిస్తోంది.

## ఆజామాబాద్ ఆయిల్‌ఫెడ్ భూమిని ప్రైవేటుకు అప్పగించొద్దు

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ**

**రూ.500 కోట్ల భూమిని రూ.87 కోట్లకే ఎందుకు?: ప్రశ్న**



హైదరాబాద్, ఆగస్టు 30 :
హైదరాబాద్ ఆజామాబాద్‌లోని తెలంగాణ ఆయిల్‌ఫెడ్‌కు చెందిన విలువైన భూమిని ప్రైవేటు వ్యక్తికి అప్పగించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసన సభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ సమీపంలోని ఆజామాబాద్ పారిశ్రామిక ప్రాంతంలో 15,984 చదరపు గజాల భూమి ఉందని పేర్కొన్నారు. 1954లో ఆయిల్ మిల్లు నిర్వహణ కోసం ఈ భూమిని ఒక ప్రైవేటు కంపెనీకి లీజుకు ఇవ్వగా, నిబంధనల ఉల్లంఘన కారణంగా 1974లో ప్రభుత్వం లీజును రద్దు చేసిందన్నారు. వివాదం సుప్రీంకోర్టు వరకు వెళ్లగా 1987 తీర్పు ప్రకారం కంపెనీకి 1,277 చదరపు గజాలు మాత్రమే మిగిలాయని, మిగిలిన 15,984 చదరపు గజాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని 1991లో జీవో నంబర్ 93 ద్వారా ఆయిల్‌ఫెడ్‌కు అప్పగించిందని వివరించారు. అప్పటి నుంచి తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఆ భూమిని స్వాధీనంలో ఉంచుకుని పరిరక్షిస్తోందన్నారు. 2003లో జీవో నంబర్ 366 ద్వారా రద్దయిన లీజును పునరుద్ధరించే ప్రయత్నం జరిగిందని, ఆ జీవోను ఎందుకు ఉపసంహరించకూడదో వివరణ కోరుతూ 2015లో ప్రభుత్వమే షోకాజ్ నోటీసు ఇచ్చిందన్నారు. 2022లో హైకోర్టు ఈ వ్యవహారంపై తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయిల్‌ఫెడ్‌కు సుమారు 1,800 చదరపు గజాలు మాత్రమే ఇచ్చి మిగిలిన భూమిని ప్రైవేటు వ్యక్తికి అప్పగించే ప్రతిపాదన ఎందుకని ప్రశ్నించారు. బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.500 కోట్ల విలువ చేసే భూమిని రూ.87 కోట్లకే ఎందుకు అప్పగిస్తున్నారని నిలదీశారు. అదే రూ.87 కోట్లు చెల్లించి ఫ్రీహోల్డ్ హక్కులు పొందేందుకు ఆయిల్‌ఫెడ్ సిద్ధంగా ఉండటమే కాకుండా, ఆ మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో సిద్ధంగా ఉంచిందన్నారు. ప్రభుత్వ సంస్థ సిద్ధంగా ఉన్నప్పుడు ప్రైవేటు వ్యక్తిని ఎందుకు ఎంచుకుంటున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేసి వాటి ఆస్తులను పరిరక్షించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## రూ.24.35 కోట్లతో వికరాబాద్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ

**పనులను పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

**తెలంగాణలో 40 స్టేషన్లకు రూ.2 వేల కోట్లకు పైగా వ్యయం**



హైదరాబాద్, ఆగస్టు 30 :
అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రూ.24.35 కోట్లతో చేపట్టిన వికరాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులను కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్.గోపాల కృష్ణన్, ఇతర అధికారులు ఆయన వెంట ఉన్నారు. స్టేషన్ భవనం, ప్లాట్‌ఫారాలు, 12 మీటర్ల వెడల్పు ఫుట్ ఓవర్ బ్రిడ్జి, పార్కింగ్, సర్క్యులేటింగ్ ఏరియా తదితర పనులను పరిశీలించిన మంత్రి నిర్మాణ ప్రాంతంలోని భద్రతా చర్యలను సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వికరాబాద్ స్టేషన్‌లో 12 మీటర్ల వెడల్పు ఫుట్ ఓవర్ బ్రిడ్జి, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఆధునిక వెయిటింగ్ హాళ్లు, మెరుగైన ప్రవేశ మార్గాలు, ముఖద్వారం, లైటింగ్ తదితర సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద తెలంగాణలో 40 రైల్వేస్టేషన్లను రూ.2 వేల కోట్లకు పైగా వ్యయంతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. గత 12 సంవత్సరాల్లో తెలంగాణ రైల్వే వ్యవస్థలో గణనీయమైన మార్పులు వచ్చాయని, కొత్త రైల్వే లైన్లు, డబ్లింగ్, మూడో లైన్, బైపాస్ లైన్లు, స్టేషన్ల అభివృద్ధి, విద్యుదీకరణ, భద్రతా పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. దేశీయ ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ వ్యవస్థ 'కవచ్' అమలైన తొలి రాష్ట్రం తెలంగాణ అని, ప్రస్తుతం కవచ్ 4.0 అప్‌గ్రేడేషన్ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల నుంచి విశాఖపట్నం, తిరుపతి, బెంగళూరు, నాగ్‌పూర్ తదితర ప్రాంతాలకు ఐదు వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డుకు వెలుపల ప్రతిపాదించిన సుమారు 400 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రైల్ ఫైనల్ లొకేషన్ సర్వేకు 2023లో అనుమతి లభించిందన్నారు. లైడార్ సర్వే పూర్తయిందని, ఉత్తర భాగానికి డీపీఆర్ సమర్పించగా దక్షిణ భాగం అలైన్‌మెంట్ ఖరారు దశలో ఉందని వివరించారు.

## నేపాల్ వరదలు.. తెలంగాణవాసుల ఆచూకీ కోసం సమన్వయం

**విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయంతో తెలంగాణ భవన్ సంప్రదింపులు**

హైదరాబాద్, ఆగస్టు 30 :
నేపాల్‌లో సంభవించిన వరద విపత్తు నేపథ్యంలో తెలంగాణకు చెందిన వారి ఆచూకీ గుర్తించడం, వారిని సురక్షితంగా తరలించడం, మృతదేహాల గుర్తింపు, స్వదేశానికి తరలింపు ప్రక్రియ కోసం తెలంగాణ భవన్ అధికారులు కేంద్ర విదేశాంగ శాఖ, ఖాట్మండులోని భారత రాయబార కార్యాలయం, నేపాల్ పోలీసులతో నిరంతరం సమన్వయం చేస్తున్నారు. విదేశాంగ శాఖ సమాచారం ప్రకారం ఆగస్టు 29న టిబెట్ నుంచి నేపాల్‌లోకి 449 మంది భారతీయులు చేరుకున్నారు. మరో 397 మందిని అదే మార్గంలో తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తెలంగాణ భవన్‌కు అందిన జాబితాలో అల్లి ఇలేషా పేరు, పాస్‌పోర్టు వివరాలు తమ వద్ద ఉన్న రికార్డులతో సరిపోలినట్లు అధికారులు తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులతో సంప్రదింపుల్లో ఉన్నారని, ఆదివారం రాత్రికి హైదరాబాద్ చేరుకునే అవకాశం ఉందని కుటుంబం ధ్రువీకరించినట్లు పేర్కొన్నారు.

మృతుల ఫొటోలు, ప్రాథమిక వివరాలను నేపాల్ ప్రభుత్వం పోలీస్ డిజాస్టర్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచింది. రసువా, నువాకోట్, ధాడింగ్, చిత్వన్, గోర్ఖా, తనహున్, నవల్‌పరాసి ఈస్ట్, నవల్‌పరాసి వెస్ట్, ఖాట్మండు జిల్లాల్లో ఉన్న మృతదేహాల గుర్తింపు కొనసాగుతోంది. దృశ్యపరంగా గుర్తించగలిగితే డీఎన్ఏ పరీక్ష తప్పనిసరి కాదని నేపాల్ పోలీసులు తెలిపినట్లు పేర్కొన్నారు. గుర్తింపు సాధ్యం కానప్పుడు తల్లిదండ్రులు, సోదరులు లేదా సోదరీమణుల వంటి మొదటి స్థాయి బంధువుల డీఎన్ఏ నమూనాలను నేపాల్ ఫోరెన్సిక్ అధికా రుల వద్ద ఉన్న నమూనాలతో సరిపోల్చనున్నారు. డీఎన్ఏ కోసం బంధువులు తప్పనిసరిగా నేపాల్ వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. కుటుంబాలు పరీక్షలు చేయించుకోవడానికి లేదా నేపాల్ వెళ్లడానికి ముందు తెలంగాణ భవన్ లేదా భారత రాయబార కార్యాలయం నుంచి మార్గదర్శకాలు పొందాలని సూచించారు.

## బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీ

**ప్రజలు మార్పు కోరుకుంటున్నారు**

**రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు**



హైదరాబాద్, ఆగస్టు 30 :
పార్టీ కార్యాలయం కేవలం ఒక భవనం కాదని, కార్యకర్తల హృదయాల్లో ఆలయంలాంటి ప్రత్యేక స్థానం కలిగిన కేంద్రమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. ఆదివారం మేడ్చల్--మల్కాజిగిరి నూతన బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో విసిగిపోయిన ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని పేర్కొన్నారు. రైతులు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు సహా అన్ని వర్గాలు ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తితో ఉన్నాయని ఆరోపించారు. ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ కుటుంబం సంతోషంగా ఉండగా ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులు సంతోషంగా ఉన్నా తెలంగాణ ప్రజలు సంతోషంగా లేరని వ్యాఖ్యానించారు. కొత్తగా తీసుకొచ్చిన 'క్యూర్' చట్టం హైదరాబాద్ ప్రజలకు 'కర్స్'గా మారుతుందని ఆరోపించారు. మురుగునీటి పన్ను, నీటి ఛార్జీల పెంపు వంటి చర్యలతో సామాన్యులపై అదనపు భారం పడే అవకాశం ఉందన్నారు. కార్పొరేటర్లు, మేయర్ అధికారాలు తగ్గి, అధికారాలు ముఖ్యమంత్రి చేతుల్లో కేంద్రీకృతమవుతాయని ఆరోపించారు. హైడ్రా కూల్చివేతలు, పరిశ్రమల తరలింపు విధానాల వల్ల సామాన్యులు, కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. 22-ఏ అంశంపై శ్వేతపత్రం విడుదల చేసి న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో 15 శాతం కమిషన్ సంస్కృతి ఉంటే కాంగ్రెస్ పాలనలో అది 30 శాతానికి చేరిందని ఆరోపించారు. తెలంగాణ యువత సమస్యలపై సెప్టెంబర్ 5న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రజలు మార్పునకు సిద్ధంగా ఉన్నారని, ఆ మార్పుకు నాయకత్వం వహించేందుకు బీజేపీ సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# ఎవరెస్ట్ ఇంగువపై ఎఫ్ఎస్ఎస్ఏఐ చర్యలు







న్యూఢిల్లీ, ఆగస్టు 30 ::

ప్రముఖ మసాలా బ్రాండ్ ఎవరెస్ట్‌కు చెందిన ఇంగువ ఉత్పత్తిపై భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ కీలక చర్యలు చేపట్టింది. ఎవరెస్ట్ తయారు చేసిన కొన్ని ఇంగువ నమూనాలు నిర్దేశిత నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేవని పరీక్షల్లో తేలడంతో, సంబంధిత ఉత్పత్తుల విక్రయాలను నిలిపివేయాలని ఆదేశించినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. ఇంగువతో పాటు మరో సంస్థకు చెందిన ఇంగువ ఉత్పత్తుల్లోనూ ప్రమాణాల లోపాలు గుర్తించినట్లు సమాచారం. దీంతో మార్కెట్‌లో ఉన్న సంబంధిత ఉత్పత్తులను ఉపసంహరించుకోవాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. వినియోగదారులకు నాణ్యమైన ఆహార ఉత్పత్తులు అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఎవరెస్ట్‌కు చెందిన మరికొన్ని మసాలా ఉత్పత్తుల నాణ్యతపైనా అధికారులు పరిశీలనలు చేపట్టినట్లు సమాచారం. అయితే ఎవరెస్ట్ బ్రాండ్‌కు చెందిన అన్ని మసాలాలపై నిషేధం విధించినట్లు భావించరాదని, గుర్తించిన నిర్దిష్ట ఉత్పత్తులు లేదా బ్యాచ్‌లకే ఈ చర్యలు పరిమితమని నివేదికలు పేర్కొంటున్నాయి.



## జూపిటర్ 110పై అదిరే ఆఫర్

### నెలకు రూ.2,474 ఈఎంఐతో సొంతం!

హైదరాబాద్, ఆగస్టు 30 :

రోజువారీ ప్రయాణాలకు సౌకర్యంగా ఉండే స్కూటర్ కోసం చూస్తున్న వారికి టీవీఎస్ జూపిటర్ 110 మంచి ఎంపికగా నిలుస్తోంది. కుటుంబ అవసరాలకు అనువుగా ఉండటంతో ఈ స్కూటర్‌కు మార్కెట్‌లో మంచి ఆదరణ ఉంది. నగదు చెల్లింపుతో కాకుండా ఈఎంఐ ద్వారా కొనుగోలు చేయాలనుకునేవారికి కూడా ఫైనాన్స్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. రూ.74,125 నుంచి ప్రారంభ ధరజూపిటర్ 110 బేస్ వేరియంట్ ధర సుమారు రూ.74,125 నుంచి ప్రారంభమవుతుంది. ఇది ఎక్స్‌షోరూమ్ ధర కాగా.. రోడ్డు పన్ను, బీమా, రిజిస్ట్రేషన్ వంటి ఖర్చులు అదనంగా ఉంటాయి.

**నెలకు రూ.2,474 ఈఎంఐ 36 నెలల రుణ కాలపరి మితి, 9.7 శాతం వడ్డీ రేటుతో బేస్ వేరియం ట్‌కు నెలకు సుమారు రూ.2,474 ఈఎంఐగా ఉండొచ్చు. డౌన్ పేమెంట్, వడ్డీ రేటు, రుణ కాలవ్యవధిని బట్టి ఈఎంఐ మారుతుంది. కుటుంబ వినియోగానికి ప్రత్యేక ఫీచర్లు జూపిటర్ 110లో 113.3 సీసీ ఇంజిన్, ఎల్ఈడీ లైట్లు, డిజిటల్ కన్సోల్, బ్లూటూత్ అనుసంధానం, నావిగేషన్, యూఎస్‌బీ ఛార్జింగ్ వంటి సౌకర్యాలు ఉన్నాయి.**

సీటు కింద సుమారు 30 లీటర్ల నిల్వ సామర్థ్యం ఉండటంతో రెండు హెల్మెట్లు పెట్టుకునే అవకాశం ఉంది. తాజాగా ద్విరంగు వేరియంట్‌ను కూడా సంస్థ తీసుకొచ్చింది.

## బంగారం ధరలకు బ్రేక్..!

హైదరాబాద్, ఆగస్టు 30 ::

డాలర్ బలపడటం, మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో దేశంలో బంగారం ధరలు ఇటీవలి రోజుల్లో తగ్గుతున్నాయి. వచ్చే వారం కూడా పసిడి ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికాలో వడ్డీ రేట్లు పెరిగే అవకాశాలపై అంచనాలు పెరగడంతో డాలర్, అమెరికా బాండ్లకు డిమాండ్ పెరుగుతోందని నిపుణులు చెబుతున్నారు. దీంతో బంగారం, వెండిపై పెట్టుబడిదారుల ఆసక్తి తగ్గే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ఆగస్టు 30 ఉదయం 6.30 గంటల సమయంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,58,240గా ఉంది. 22 క్యారెట్ల బంగారం రూ.1,45,050గా, 18 క్యారెట్ల పసిడి రూ.1,18,680గా నమోదైంది. కిలో వెండి ధర రూ.2.60 లక్షల వద్ద కొనసాగుతోంది. తెలంగాణలోని వరంగల్, నిజామాబాద్, ఖమ్మం నగరాల్లోనూ ఇదే ధరలు కొనసాగుతున్నాయి. ఏపీలో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, తిరుపతిలో 24 క్యారెట్ల బంగారం రూ.1,58,240, 22 క్యారెట్ల పసిడి రూ.1,45,050గా ఉంది.



## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఈవో శశిధర్ జగదీశన్ కీలక నిర్ణయం

ఆగస్టు 30 :

ప్రైవేట్ రంగ దిగ్గజ బ్యాంకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో కీలక మార్పు చోటుచేసుకుంది. బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)గా ఉన్న శశిధర్ జగదీశన్ పదవీ విరమణ నిర్ణయాన్ని ప్రకటించారు. తన పదవీకాలాన్ని పొడిగించాలని బోర్డు చేసిన పునర్‌నియామక ప్రతిపాదనను ఆయన తిరస్కరించినట్లు బ్యాంక్ వెల్లడించింది. ఆయన ప్రస్తుత పదవీకాలం 2026 అక్టోబర్ 26తో ముగియనుంది. బోర్డు విజ్ఞప్తిని సైతం తిరస్కరించిన జగదీశన్ పదవీకాలాన్ని పొడిగించే అంశంపై మరోసారి ఆలోచించాలని బోర్డు సభ్యులు కోరినప్పటికీ.. జగదీశన్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదని సమాచారం.







## సెప్టెంబర్‌లో బ్యాంకులకు వరుస సెలవులు.. మొత్తం 16 రోజులు బంద్

హైదరాబాద్, ఆగస్టు 30 :

సెప్టెంబర్ నెలలో బ్యాంకు ఖాతాదారులు తమ పనులను ముందుగానే ప్లాన్ చేసుకోవడం మంచిది. ఆర్బీఐ సెలవుల క్యాలెండర్ ప్రకారం వివిధ రాష్ట్రాల్లో పండుగలు, ఆదివారాలు, రెండో--నాలుగో శనివారాలు కలిపి మొత్తం 16 రోజుల వరకు బ్యాంకులకు సెలవులు ఉండనున్నాయి. అయితే ఈ సెలవులన్నీ దేశవ్యాప్తంగా ఒకేసారి వర్తించవు. రాష్ట్రాలు, ప్రాంతాలను బట్టి బ్యాంకు సెలవుల్లో మార్పులు ఉంటాయి. తెలుగు రాష్ట్రాల్లో పండుగల ప్రభావం సెప్టెంబర్‌లో కృష్ణాష్టమి, వినాయక చవితి వంటి పండుగల కారణంగా వివిధ ప్రాంతాల్లో బ్యాంకు శాఖలు మూతపడనున్నాయి. ముఖ్యంగా వినాయక చవితి సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో బ్యాంకింగ్ కార్యకలాపాలపై ప్రభావం ఉండే అవకాశం ఉంది. వీటితో పాటు ప్రతి ఆదివారం, రెండో శనివారం, నాలుగో శనివారం సాధారణ బ్యాంకు సెలవులు ఉంటాయి. అందువల్ల శాఖలకు వెళ్లి పూర్తి చేయాల్సిన పనులు ఉన్నవారు ముందుగానే సెలవుల వివరాలను పరిశీలించుకోవడం మంచిది. నెలాఖరులో సమ్మెతో సేవలకు అంతరాయం! నెల చివరి రోజుల్లో బ్యాంకు ఉద్యోగ సంఘాలు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది.

## ఏపీలో 25 భారీ పారిశ్రామిక పార్కులు.. 20 వేల ఎకరాల్లో అభివృద్ధి!

అమరావతి, ఆగస్టు 30 :

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా 20 వేల ఎకరాల్లో 25 భారీ పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేసేందుకు ఏపీఐఐసీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ పార్కులు అందుబాటులోకి వస్తే కొత్త పరిశ్రమల ఏర్పాటుతో పాటు పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. కేంద్ర పథకం కింద పారిశ్రామిక పార్కుల ఏర్పాటు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భవ్య పథకం కింద దేశవ్యాప్తంగా 100 పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా తొలి దశలో ఏపీఐఐసీ ఆరు ప్రాంతాల నుంచి ప్రతిపాదనలు పంపింది. తదుపరి దశలో మరో 16 ప్రాంతాల్లో పార్కుల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసింది. భూమి అభివృద్ధికి కేంద్రం గ్రాంట్ రూపంలో ఆర్థిక సహాయం అందించనుంది. ఇప్పటికే 12 వేల ఎకరాల భూసేకరణ పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు అవసరమైన భూమిలో ఇప్పటికే 12 వేల ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం సేకరించింది. మిగిలిన భూమి సేకరణ ప్రక్రియను కూడా వేగవంతం చేస్తున్నారు. పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయడం ద్వారా పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. మరో మూడు ప్రాంతాల్లో కొత్త పార్కులకు ప్రతిపాదనలు శ్రీకాకుళం జిల్లా మూలపేట, శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి, అనకాపల్లి ప్రాంతాల్లో మరో మూడు కొత్త పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. వీటి కోసం అదనంగా 8 వేల ఎకరాల భూమిని సేకరించే ప్రక్రియ కొనసాగుతోంది. కొత్త పరిశ్రమలు ఏర్పాటైతే స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి.







## ఫోన్ తడిసిందా? ఈ తప్పులు చేస్తే అంతే..

వర్షంలో తడవడం, పొరపాటున నీటిలో పడటం వంటి కారణాలతో మొబైల్ ఫోన్ తడిసిపోవచ్చు. అలాంటి సమయంలో కొన్ని పొరపాట్లు చేస్తే ఫోన్ పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. అందుకే ఫోన్ తడిసిన వెంటనే కింది జాగ్రత్తలు పాటించాలి. ఇలా అస్సలు చేయొద్దు నోటితో ఊదడం, హెయిర్ డ్రైయర్‌తో వేడి గాలి పెట్టడం, ఎండలో పెట్టడం, మైక్రోవేవ్‌లో పెట్టడం వంటివి చేయకూడదు. అలాగే బియ్యంలో పాతిపెట్టడం కూడా సరైన పద్ధతి కాదు. తడిసిన ఫోన్‌ను వెంటనే ఛార్జింగ్‌కు పెట్టడం అత్యంత ప్రమాదకరం. ముందుగా ఫోన్‌ను ఆపేయాలి ఫోన్‌ను శుభ్రమైన గుడ్డతో తుడిచి, సిమ్ కార్డు ట్రేను తొలగించాలి. వీలైతే తక్కువ శక్తితో పనిచేసే వాక్యూమ్ క్లీనర్‌తో రంధ్రాల వద్ద ఉన్న నీటిని తొలగించవచ్చు. 24 గంటలు సహజంగా ఆరనివ్వాలి ఫోన్‌ను పొడి, పత్తి గుడ్డపై ఉంచి ఫ్యాన్ గాలి తగిలేలా కనీసం 24 గంటలు ఉంచడం సురక్షితం. ఉప్పునీరు లేదా మురుగునీటిలో పడితే వెంటనే ఫోన్‌ను ఆపేసి, బయట భాగాన్ని శుభ్రమైన నీటితో తేలికగా శుభ్రం చేయాలి. పూర్తిగా ఆరిన తర్వాతే వినియోగించడం మంచిది.

- హైదరాబాద్, ఆగస్టు 30. :

# ఎరువుల నిర్వహణలో సాంకేతిక విప్లవం





**న్యూఢిల్లీ, ఆగస్టు 30 :**
దేశంలో ఎరువుల నిర్వహణను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా మార్చే దిశగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సమగ్ర ఎరువుల నిర్వహణ వ్యవస్థ కొత్త దశలోకి ప్రవేశించింది. రైతుల పంటల వివరాల నమోదుకు ఉపయోగిస్తున్న వ్యవస్థతో దీనిని అనుసంధానం చేయడం ద్వారా ఎరువుల అవసరాలు, పంపిణీ, వినియోగంపై మరింత ఖచ్చితమైన సమాచారం అందుబాటులోకి రానుంది. రైతులకు సరైన సమయంలో అవసరమైన ఎరువులు అందేలా చర్యలు తీసుకోవడంలో ఈ వ్యవస్థ కీలక పాత్ర పోషించనుంది. దేశవ్యాప్తంగా 14 కోట్లకుపైగా ఆధార్‌తో అనుసంధానమైన కొనుగోలుదారులు, 2.5 లక్షలకు పైగా చిల్లర విక్రయ కేంద్రాలు, ఏడాదికి సుమారు 7 కోట్ల మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలకు సంబంధించిన వివరాలు ఈ వ్యవస్థలో నమోదవుతున్నాయి. దీంతో ఎరువుల సరఫరా గొలుసులో ప్రతి దశను పర్యవేక్షించే అవకాశం అధికారులకు లభిస్తోంది. రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువుల పంపిణీని ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు ఇది ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. ఎరువుల ఉత్పత్తి, దిగుమతులు, రవాణా, నిల్వలు, రాష్ట్రాలు మరియు జిల్లాల వారీగా పంపిణీ, చిల్లర విక్రయాలకు సంబంధించిన వివరాలను ఒకేచోట పరిశీలించేలా ప్రత్యేక విశ్లేషణ వేదికలను అభివృద్ధి చేశారు. ఈ సాంకేతిక వేదికల ద్వారా ఎక్కడైనా ఎరువుల కొరత లేదా సరఫరాలో అంతరాయం ఏర్పడే పరిస్థితులను ముందుగానే గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీంతో వ్యవసాయ సీజన్‌లో రైతులు ఇబ్బందులు పడే అవకాశాలు తగ్గుతాయని భావిస్తున్నారు. రైతులు ముందుగానే ఎరువులను బుక్ చేసుకునే విధానాన్ని కూడా ఈ వ్యవస్థతో అనుసంధానం చేశారు. మొబైల్ ఆధారిత బుకింగ్ విధానం ద్వారా రైతులు తమ అవసరాలను ముందుగానే నమోదు చేసుకోవచ్చు. ఆ వివరాల ఆధారంగా సంబంధిత ప్రాంతాలకు తగినంత ఎరువుల నిల్వలు అందుబాటులో ఉంచేలా అధికారులు ప్రణాళికలు రూపొందించగలుగుతారు. దీనివల్ల సరఫరా ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. వ్యవసాయ రంగంలో డిజిటల్ సాంకేతికత వినియోగాన్ని విస్తరించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతోంది. ఎరువుల సరఫరా వ్యవస్థలో పారదర్శకత పెరగడంతో పాటు అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత వంటి సమస్యలను కూడా నియంత్రించే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. రైతులకు నాణ్యమైన సేవలు అందించడంలో ఈ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడుతున్నారు. దేశ వ్యవసాయ రంగ అవసరాలకు అనుగుణంగా ఎరువుల నిర్వహణను ఆధునికీకరించే దిశగా ఈ చర్యలు మైలురాయిగా నిలుస్తాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. రైతులకు అవసరమైన ఎరువులు సరైన సమయంలో అందుబాటులో ఉండేలా చేయడం, సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం, నిర్ణయాల్లో ఖచ్చితత్వాన్ని పెంచడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇకపై ఎరువుల పంపిణీ ప్రక్రియలో డేటా ఆధారిత నిర్ణయాలకు మరింత ప్రాధాన్యం లభించనుంది.

# నెల్లిమర్లలో రహదారుల అభివృద్ధికి శ్రీకారం



**నెల్లిమర్ల, ఆగస్టు 30 :**
నెల్లిమర్ల రూరల్ మండల పరిధిలో గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. మొయిద జంక్షన్ నుంచి మొయిద నారాయణపురం వరకు ఉన్న ఆర్అండ్‌బీ బీటీ బ్రాంచ్ రోడ్డు అభివృద్ధి పనులకు నెల్లిమర్ల శాసనసభ్యురాలు శ్రీమతి లోకం నాగ మాధవి శంకుస్థాపన చేశారు. ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రూ.1.5 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ పనులు గ్రామీ ణ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందించను న్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్య క్రమంలో ఎమ్మెల్యే శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. రోడ్డు రీ-సర్ఫేసింగ్‌తో పాటు అవసర మైన అభివృద్ధి పనులను చేపట్టి ప్రజలకు సురక్షితమైన ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు అధికా రులు తెలిపారు. కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి నాణ్యమైన రహదా రులే ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. రైతులు తమ వ్యవసా య ఉత్పత్తులను మార్కెట్లకు సులభంగా తరలించేందుకు, విద్యార్థులు విద్యా సంస్థలకు సకాలంలో చేరుకునేందుకు, ప్రజలు అత్యవసర అవసరాల కోసం సౌకర్యవంతంగా ప్రయాణించేందుకు మెరుగైన రోడ్లు ఎంతో అవసరమని చెప్పారు. నెల్లిమర్ల నియోజ కవర్గంలోని లింక్ రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ను మండల, జిల్లా కేంద్రాలతో అనుసంధానం చేసే రహదా రులను యుద్ధప్రా తిపదికన అభివృద్ధి చేస్తున్నా మని పేర్కొ న్నారు. ప్రజల అవసరా లను దృష్టిలో ఉంచుకుని రవాణా సౌకర్యాలను మరింత మెరుగు పరచడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రూ.1.5 కోట్ల నిధులతో చేపట్టిన ఈ పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వేగంగా పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా పర్యవేక్షించాలని సూచించారు. ప్రజాధనం వినియోగంలో పారదర్శకత పాటిస్తూ అభివృద్ధి ఫలాలు ప్రజలకు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నెల్లిమర్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని లోకం నాగ మాధవి తెలిపారు.

# చెంచు గిరిజనులకు వడ్డీలేని రుణ సాయం



**శ్రీకాకుళం, ఆగస్టు 30. :**
గిరిజనుల ఆర్థికాభివృద్ధితో పాటు వారి సంప్రదాయ వృత్తులు, సంస్కృతిని పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఉన్నతి చెంచు తెగ సంఘం సభ్యులకు సున్నా వడ్డీతో కూడిన రూ.8 లక్షల బ్యాంకు రుణం చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన కుటుంబాల జీవనోపాధి మెరుగుదలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. చెంచు వృత్తిని కొనసాగించేందుకు అవసరమైన సంప్రదాయ వస్త్రాల కొనుగోలు, వృత్తి నిర్వహణకు అవసరమైన ఇతర ఖర్చుల కోసం సంఘ సభ్యులు కోరిన మేరకు వడ్డీ లేని రుణ సదుపాయాన్ని కల్పించినట్లు మంత్రి తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా సంప్రదాయ వృత్తులు కనుమరుగైపోకుండా ప్రత్యేక ప్రణాళికతో ఈ సహాయం అందిస్తున్నా మని పేర్కొన్నారు. గిరిజనుల జీవన విధానాన్ని బలోపేతం చేయడంలో ఇటువంటి చర్యలు కీలకంగా నిలుస్తాయని అన్నారు. దేశ సంస్కృతిలో గిరిజన సంప్రదాయాలకు ప్రత్యేక స్థానం ఉందని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. ఆధునికత ప్రభావంతో అనేక సంప్రదాయ వృత్తులు కనుమరుగవుతున్న నేపథ్యంలో వాటిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తోం దని వివరిం చారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధి అవకాశా ల కల్పన, విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపా యాల అభివృద్ధి తో పాటు సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా యువత తమ సంప్రదాయాలను తెలుసుకుని కొనసాగించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గిరిజనుల ప్రత్యేకతను ప్రపంచానికి పరిచయం చేసే దిశగా కూడా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. చెంచు తెగ సభ్యులు తమ వృత్తిని కొనసాగించేందుకు ప్రభుత్వం అందించిన సహకారంపై హర్షం వ్యక్తం చేశారు. వడ్డీలేని రుణ సదుపాయం తమకు ఎంతో ఉపయోగపడుతుందని, జీవనోపాధి మెరుగుపడేందుకు దోహదపడుతుందని తెలిపా రు. గిరిజనుల అవసరాలను గుర్తించి ప్రత్యక్షంగా సహాయం అందించడం పట్ల కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గిరిజనుల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన, సాంస్కృతిక పరిర క్షణ అనే మూడు లక్ష్యాలతో ఎన్డీఏ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. భవిష్యత్ తరాలకు కూడా గిరిజన సంప్రదాయాలు, జీవన విధానాలు చేరేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటా మని తెలిపారు.

# ప్రశాంతంగా ముగిసిన నీట్–పీజీ పరీక్ష

**శ్రీకాకుళం, ఆగస్టు 30. :**
జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్--పీజీ 2026 పరీక్ష ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు పోలీసు శాఖ పరీక్షా కేంద్రాల వద్ద విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. పరీక్ష ప్రక్రియలో ఎలాంటి అంతరాయాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు అభ్యర్థులు ప్రశాంతంగా పరీక్ష రాసేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని నాలుగు పరీక్షా కేంద్రాల వద్ద ఇద్దరు డీఎస్పీ స్థాయి అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎచ్చెర్ల మండలం చిలకపాలెం జంక్షన్‌లోని శ్రీ శివాని ఇంజినీరింగ్ కళాశాల, బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం సమీపంలోని శ్రీ వెంక టేశ్వర ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల, నరసన్నపే టలోని కోర్ టెక్నాలజీస్ కేంద్రం, టెక్కలిలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల వద్ద పోలీసులు ప్రత్యేక నిఘా కొనసా గించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం మాత్రమే కేంద్రాల్లోకి అనుమతించారు. భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేస్తూ పరీక్షా నిర్వహణలో పారదర్శ కతకు ప్రాధాన్యత ఇచ్చారు. అభ్యర్థులు, తల్లిదండ్రులు, పరీక్షా సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించారు. పరీక్ష సమయాల్లో ట్రాఫిక్ రద్దీ పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాలకు వచ్చే అభ్యర్థులు సమయానికి చేరుకునేలా ప్రధాన రహదారుల వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా పోలీసులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించారు. భద్రతా చర్యల్లో భాగంగా పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో డ్రోన్ సర్వైలెన్స్‌ను వినియోగించారు.



# పాల మీగడతో ఆరోగ్యానికి మేలు

**డెస్క్, ఆగస్టు 30 :**
పాలను మరిగించి చల్లార్చిన తర్వాత పైభాగంలో ఏర్పడే మందమైన పొరను పాల మీగడగా పిలుస్తారు. ఇది సహజసిద్ధమైన పాల ఉత్పత్తి మాత్రమే కాకుండా శరీరానికి అవసరమైన అనేక పోషకాలను అందించే ఆహార పదార్థంగా కూడా గుర్తింపు పొందింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ పాల మీగడను ఆహారంలో భాగంగా తీసుకునే సంప్రదాయం కొనసాగుతోంది. పాల మీగడలో కొవ్వు, ప్రోటీన్లు, విటమిన్ ఎ, విటమిన్ డి వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి కంటి ఆరోయగాన్ని కాపాడటంతో పాటు శరీర ఎదుగుదలకు, రోగనిరోధక శక్తి పెంపుదలకు తోడ్పడతాయి. చిన్నపిల్లలు, శారీరక శ్రమ ఎక్కువ గా చేసే వారికి ఇది మంచి శక్తి వనరుగా ఉపయోగపడుతుంది. ఎముకలు, దంతాల దృఢత్వానికి అవసరమైన పోషకాలు కూడా పాల మీగడలో లభిస్తాయి. ముఖ్యంగా పెరుగుతున్న వయస్సులో ఉన్న పిల్లలకు పరిమిత మోతాదులో ఇవ్వడం వల్ల శరీరానికి కావాల్సిన శక్తి, పోషకాలు అందుతాయని నిపుణులు చెబుతున్నారు. చలికాలంలో తీసుకుంటే శరీరానికి వేడి అందించడంలో కూడా సహాయప డుతుంది. పాల మీగడతో నెయ్యి, వెన్న వంటి పదార్థాలను తయారు చేస్తారు. అలాగే అనేక సంప్రదాయ మిఠాయిలు, వంటకాల్లో దీనిని వినియోగిస్తారు. రుచితో పాటు పోషక విలువలు ఉండటంతో ఇది అనేక కుటుంబాల్లో ప్రత్యేక స్థానం సంపాదించ ుకుంది. అయితే పాల మీగడలో కొవ్వు శాతం ఎక్కువగా ఉండటంతో అధికంగా తీసుకోవడం మంచిది కాదని వైద్యులు సూచిస్తున్నారు.





# నూనె లేని అల్పాహారాలతో ఆరోగ్యానికి మేలు

**డెస్క్, ఆగస్టు 30. :**
ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలనుకునే వారు ఉదయపు అల్పాహారంలో నూనె వాడకాన్ని తగ్గించాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. నూనె లేకుండా లేదా చాలా తక్కువ నూనెతో తయారుచేసే అల్పాహారాలు శరీరానికి అవసరమైన శక్తిని అందించడంతో పాటు బరువు నియంత్రణలో కూడా సహాయపడతాయని చెబుతున్నారు. ముఖ్యంగా ప్రోటీన్, పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంటుంది. ఇడ్లీ, రాగి ఇడ్లీ, పెసరట్టు, మొలకెత్తిన శనగల సలాడ్, ఉడికించిన చిలగడదుంప, ఓట్స్ వంటి ఆహారాలు నూనె లేకుండా సులభంగా తయారుచేసుకోవచ్చు. ఇవి తక్కువ కేలరీలతో పాటు శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. ఆవిరిలో ఉడికించిన ఇడ్లీలు జీర్ణక్రియకు అనుకూలంగా ఉండటంతో పాటు రోజంతా ఉత్సాహంగా ఉండేందుకు తోడ్పడతాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఉదయం అల్పాహారంలో ఓట్స్, చియా గింజలు, పండ్లు, నానబెట్టిన బాదంపప్పు, ఉడికించిన గుడ్లు వంటి పదార్థాలను చేర్చడం వల్ల శరీరానికి ప్రోటీన్, ఖనిజాలు, విటమిన్లు సమృద్ధిగా లభిస్తాయి. వీటివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు సమతుల్యంగా ఉండటంతో పాటు శక్తి స్థాయి కూడా మెరుగుపడుతుంది. అధిక నూనెతో చేసిన పూరీలు, పరాటాలు, వేయించిన అల్పాహారాల కంటే నూనె లేని లేదా తక్కువ నూనెతో తయారుచేసిన ఆహారాలను ఎంచుకోవడం గుండె ఆరోగ్యానికి కూడా మేలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# అరటి మొగ్గ కూర ఆరోగ్యానికి వరం

**డెస్క్, ఆగస్టు 31 టెక్ గురు ప్రతినిధి):**
అరటి చెట్టులోని ప్రతి భాగం ఉపయోగకరమే అయినప్పటికీ, అరటి మొగ్గకు ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో తరతరాలుగా ఆహారంగా వినియోగిస్తున్న అరటి మొగ్గతో తయారుచేసే కూర రుచికరంగా ఉండటమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. ఇందులో విటమిన్లు, ఖనిజాలు, పీచుపదార్థాలు సమృద్ధిగా ఉండటంతో పోషకా హారంగా గుర్తింపు పొందింది. అరటి మొగ్గలో ఉండే పీచుపదా ర్థాలు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. మలబద్ధకం సమస్యను తగ్గించడంలో ఇది ఉపయోగకరంగా పనిచేస్తుంది. అలాగే కడుపు ఎక్కువసేపు నిండిన భావన కలిగించడం వల్ల అనవసరంగా ఎక్కువ ఆహారం తీసుకునే అలవాటు తగ్గుతుంది. బరువు తగ్గాలని ప్రయత్నించే వారికి అరటి మొగ్గ కూర మంచి ఎంపికగా భావిస్తారు. తక్కువ కేలరీలు, అధిక పీచుపదార్థాలు ఉండటం వల్ల శరీర బరువును నియంత్రించడంలో సహకరిస్తుంది. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లలో దీనిని భాగం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అరటి మొగ్గలో పొటాషియం, ఐరన్ వంటి ఖనిజాలు కూడా ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన పోషకాలను అందించడంలో సహాయ పడతాయి. గ్రామీణ ప్రాంతాల్లో అరటి మొగ్గను పప్పుతో, కొబ్బరితో లేదా వివిధ మసాలా లతో కలిపి రుచికరమైన కూరగా తయారుచేస్తారు.





# కందిపప్పుతో ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు

**డెస్క్, ఆగస్టు 30 :**

మన రోజువారీ ఆహారంలో కీలక పాత్ర పోషించే కందిపప్పు ఆరోగ్యానికి ఎన్నో విధాలుగా మేలు చేస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. భారతీయ వంటకాల్లో విస్తృతంగా ఉపయోగించే ఈ పప్పుదినుసు ప్రోటీన్లు, ఫైబర్, విటమిన్లు, ఖనిజ లవణాలు వంటి అనేక పోషకాలతో నిండి ఉంటుంది. ముఖ్యంగా శాకాహారులు శరీరానికి అవసరమైన ప్రోటీన్లను పొందేందుకు కందిపప్పు మంచి ఆహారంగా పరిగణించబడుతోంది. ప్రతిరోజూ మితంగా కందిపప్పును ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కందిపప్పులో ఉండే అధిక ప్రోటీన్ శాతం కండరాల అభివృద్ధికి, శరీర కణాల పునరుద్ధరణకు దోహదపడుతుంది. పిల్లలు, యువకులు, వృద్ధులు ఇలా అన్ని వయసుల వారు దీనిని ఆహారంలో చేర్చుకోవచ్చు. శారీరక శ్రమ ఎక్కువగా చేసే వారికి ఇది శక్తిని అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా కందిపప్పు సహాయపడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా కందిపప్పు ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇందులో ఉండే పీచుపదార్థం పేగుల ఆరోగ్యాన్ని కాపాడి మలబద్ధకం సమస్యను తగ్గించడంలో సహాయపడుతుంది. జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి అవసరమైన పోషకాలను అందించడంతో పాటు కడుపు ఎక్కువసేపు నిండుగా ఉన్న భావన కలిగిస్తుంది. దీంతో అధికంగా ఆహారం తీసుకునే అలవాటు తగ్గి బరువు నియంత్రణకు కూడా దోహదపడుతుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో కందిపప్పు కీలక పాత్ర పోషిస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇందులో ఉండే పొటాషియం, ఫైబర్ వంటి పోషకాలు రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో ఉపయోగపడతాయి. క్రమం తప్పకుండా కందిపప్పును ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. కందిపప్పులో ఐరన్, ఫోలేట్ వంటి పోషకాలు కూడా సమృద్ధిగా ఉంటాయి. ఇవి రక్తహీనత సమస్యను తగ్గించడంలో సహాయపడటంతో పాటు శరీరంలో ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి దోహదపడతాయి.



# కొబ్బరి బెల్లం.. శరీరానికి తక్షణ శక్తిని అందించే కార్బోహైడ్రేట్ల మూలం

**డెస్క్,ఆగస్టు 30, :**

కొబ్బరి చెట్ల పువ్వుల నుంచి తీసే తియ్యని రసాన్ని మరిగించి తయారు చేసే కొబ్బరి బెల్లం ఇటీవలి కాలంలో ఆరోగ్య ఆహారంగా ప్రాచుర్యం పొందుతోంది. సాధారణ తెల్ల చక్కెరకు ప్రత్యామ్నాయంగా చాలామంది దీనిని ఉపయోగిస్తున్నారు. సహజ పద్ధతిలో తయారయ్యే ఈ బెల్లంలో కొన్ని ఖనిజాలు, సూక్ష్మ పోషకాలు ఉండటంతో పోషకాహార నిపుణుల దృష్టిని ఆకర్షిస్తోంది. కొబ్బరి బెల్లంలో పొటాషియం, ఇనుము, జింక్, మెగ్నీషియం వంటి ఖనిజాలు స్వల్ప మోతాదులో ఉంటాయి. అలాగే కొన్ని యాంటీ ఆక్సిడెంట్ సమ్మేళనాలు కూడా ఇందులో లభిస్తాయి. తెల్ల చక్కెరతో పోలిస్తే తక్కువ ప్రాసెసింగ్‌కు గురికావడం వల్ల సహజ లక్షణాలు కొంతవరకు నిలిచి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఈ బెల్లం శరీరానికి తక్షణ శక్తిని అందించే కార్బోహైడ్రేట్ల మూలం. కొంతమంది దీనిని టీ, కాఫీ, స్వీట్లు, పాయసం వంటి వంటకాలలో ఉపయోగిస్తారు. ప్రత్యేకమైన రుచి, సువాసన కారణంగా కూడా దీనికి మంచి ఆదరణ లభిస్తోంది. అయితే కొబ్బరి బెల్లం ఆరోగ్యకరమైనదే కాబట్టి ఎంతైనా తినొచ్చని అనుకోవడం సరైంది కాదు. ఇందులో కూడా సహజ చక్కెరలు అధికంగా ఉంటాయి. ఎక్కువగా తీసుకుంటే అదనపు కేలరీలు శరీరంలో చేరి బరువు పెరగడం, రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. మధుమేహం ఉన్నవారు కొబ్బరి బెల్లాన్ని కూడా జాగ్రత్తగా తీసుకోవాలి. ఇది సాధారణ చక్కెర కంటే భిన్నమైనప్పటికీ, రక్తంలో చక్కెరపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందువల్ల వైద్యులు లేదా పోషకాహార నిపుణుల సలహా మేరకు మాత్రమే ఆహారంలో చేర్చుకోవడం మంచిది. కొబ్బరి బెల్లం సహజ తీపి పదార్థంగా, కొన్ని ఖనిజాల మూలంగా ఉపయోగపడుతుంది. అయితే దీనిని ఔషధంగా కాకుండా సమతుల్య ఆహారంలో భాగంగా మాత్రమే చూడాలని నిపుణులు సూచిస్తున్నారు. మితంగా ఉపయోగిస్తే రుచి, పోషక విలువలను పొందవచ్చని వారు చెబుతున్నారు.

# మచిలీపట్నం అభివృద్ధికి రియల్ ఎస్టేట్ రంగం దోహదం చేయాలి: మంత్రి కొల్లు రవీంద్ర





**మచిలీపట్నం, ఆగస్టు 30 :**

మచిలీపట్నం సమీపంలోని తరకటూరు వద్ద కార్తికేయ ఇన్ఫ్రా అండ్ డెవలపర్స్ సంస్థ ఏర్పాటు చేసిన కోస్టల్ పార్క్ వెంచర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. వెంచర్‌ను ప్రారంభించిన అనంతరం నిర్వాపకులను అభినందించి, ప్రాంత అభివృద్ధికి ఇలాంటి ప్రాజెక్టులు దోహదపడాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ మచిలీపట్నం పరిసర ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. పారిశ్రామిక, వాణిజ్య, నివాస రంగాల్లో విస్తరణ జరుగుతున్న నేపథ్యంలో రియల్ ఎస్టేట్ రంగానికి మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన సేవలు అందించాలని అభివృద్ధి సంస్థలకు సూచించారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయడంలో రియల్ ఎస్టేట్ సంస్థలు కీలక పాత్ర పోషించాలని మంత్రి అన్నారు. అందుబాటు ధరల్లో మౌలిక వసతులతో కూడిన గృహ స్థలాలు, నివాస ప్రాజెక్టులు అందించడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని సంపాదించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రహదారులు, పారిశ్రామిక కారిడార్లు, పోర్టు ఆధారిత అభివృద్ధి కార్యక్రమాల వల్ల మచిలీపట్నం ప్రాంతం మరింత వేగంగా ఎదుగుతోందని వివరించారు. ఈ అవకాశాలను వినియోగించుకుంటూ పెట్టుబడిదారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నగర విస్తరణతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి అవసరమని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన జీవన వాతావరణాన్ని కల్పించే ప్రాజెక్టులు మరింతగా రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, కార్తికేయ ఇన్ఫ్రా అండ్ డెవలపర్స్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, వ్యాపారవేత్తలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కోస్టల్ పార్క్ వెంచర్ మచిలీపట్నం ప్రాంత అభివృద్ధికి తోడ్పడాలని వారు ఆకాంక్షించారు.

# డ్రోన్ నిఘాతో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

**తిరుపతి, ఆగస్టు 30 :**



తిరుపతి జిల్లా పోలీస్ శాఖ కోడూరు సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రత్యేక నిఘా చేపట్టింది. డ్రోన్ కెమెరాల సహాయంతో పలు ప్రాంతాలను పర్యవేక్షిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు ముమ్మరం చేసింది. పేకాట స్థావరాలు, కోళ్ల పందేలు నిర్వహించే ప్రాంతాలు, గంజాయి వినియోగం మరియు అక్రమ రవాణా జరిగే అవకాశమున్న ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను గుర్తించి అడ్డుకునేందుకు డ్రోన్‌ల ద్వారా నిఘా కొనసాగిస్తున్నారు. డ్రోన్ పర్యవేక్షణ ద్వారా మారుమూల ప్రాంతాలు, వ్యవసాయ క్షేత్రాలు, ఖాళీ స్థలాలు మరియు అనుమానాస్పద ప్రాంతాలను సులభంగా పరిశీలించే అవకాశం లభిస్తోందని పోలీసులు తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని అధికారులు స్పష్టం చేశారు. ప్రజలు కూడా తమ పరిసరాల్లో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ నేరాల నివారణ, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని పోలీసులు తెలిపారు. డ్రోన్ నిఘా కార్యక్రమాలు భవిష్యత్తులో మరింత విస్తృతంగా కొనసాగనున్నాయని వెల్లడించారు. అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనతో పాటు ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడమే లక్ష్యంగా కోడూరు సర్కిల్ పరిధిలో ఈ ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టినట్లు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ పేర్కొంది.

# బీసీ జనగణనపై కేంద్రాన్ని నిలదీసిన శ్రీనివాస్ గౌడ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 30 :**



మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీసీ జనగణన, రిజర్వేషన్ల అంశాలపై కేంద్ర ప్రభుత్వం, జాతీయ రాజకీయ పార్టీల వైఖరిని తీవ్రంగా విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలోని మెజారిటీ వర్గాలకు రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదని ఆయన అన్నారు. బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు వారి హక్కుల పరిరక్షణ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని ఆరోపించారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని రాజకీయ నాయకులు పదేపదే చెబుతున్నప్పటికీ, ఆ దిశగా స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా బీసీ జనగణన నిర్వహించి ప్రతి కులానికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించాలని డిమాండ్ చేశారు. కులాల వారీగా అధికారిక గణాంకాలు లేకుండా రిజర్వేషన్ల శాతం నిర్ణయించడం న్యాయపరంగా నిలబడదని, అందుకే కోర్టుల్లో అనేక నిర్ణయాలు నిలిచిపో తున్నా యని చెప్పారు. తమిళ నాడు, కర్ణాటక, తెలంగాణ, పంజాబ్ వంటి రాష్ట్రాలు జనాభా ప్రాతిపదికన రిజర్వే షన్ల అంశాన్ని ముందుకు తీసుకువచ్చినా, సరైన చట్టప రమైన ఆధారాలు లేక పోవడం వల్ల న్యాయస్థానాల్లో ఇబ్బందు లు ఎదురవుతున్నాయని ఆయ న అభిప్రాయపడ్డారు. సెన్సస్ లో బీసీలకు సంబంధించిన పూర్తి వివరాలు నమోదు చేసి, రాజ్యాంగ సవరణల ద్వారా రిజర్వేషన్లకు బలమైన చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు కూడా బీసీ జనగణన అంశంలో స్పష్టత చూపడం లేదని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. బీసీల సంఖ్య బయ టపడితే రాజకీయ సమీకరణాలు మారుతాయనే భయం తోనే ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారా అనే అనుమానం వ్యక్తం చేశారు. దేశంలో 80 కోట్లకు పైగా ఓబీసీ జనాభా ఉన్నప్పటికీ, చట్టసభల్లో వారికి తగిన ప్రాతినిధ్యం లేదని అన్నారు. ఓబీసీ కులాలకు ఎస్సీ, ఎస్టీ తరహాలో అధికారిక నంబరింగ్ వ్యవస్థను అమలు చేయాలని ఆయన సూచించారు. వివిధ రాష్ట్రాల్లో ఒకే కులాన్ని వేర్వేరు పేర్లతో పిలుస్తున్న నేపథ్యంలో ముందుగా సమగ్ర జాబితా రూపొందించి, అనంతరం జనగణన చేపట్టాలని పేర్కొన్నారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పించినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. బీసీ జనగణన, రిజర్వేషన్ల అంశాలను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే దేశవ్యాప్తంగా ఓబీసీ వర్గాలు ఉద్యమబాట పట్టే పరిస్థితి ఏర్పడుతుందని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ప్రధానమంత్రి ఈ అంశంపై చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటే దేశ చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు పి. విల్సన్, ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ప్రొఫెసర్ సూరజ్ మండల్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ అధ్యక్షుడు బాలగోని బాల్‌రాజు గౌడ్, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# భగవద్గీత శ్లోక పఠన పోటీలకు విశేష స్పందన

**కరీంనగర్, ఆగస్టు 30: :**

అతి పురాతనమైన సంస్కృత భాషను దేవభాషగా భావిస్తారని, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను తరతరాలకు అందించడంలో సంస్కృతానికి అపూర్వమైన గుర్తింపు ఉందని తెలుగు భాషా సంరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ సాహితీవేత్త దాస్యం సేనాధిపతి అన్నారు. తెలుగు భాషా సంరక్షణ సంఘం, శాతవాహన లయన్స్ క్లబ్, లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన భగవద్గీత శ్లోక పఠన పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా దాస్యం సేనాధిపతి మాట్లాడుతూ నేటి తల్లిదండ్రులు పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ సంపదను పరిచయం చేసి భావితరాలకు అం దించేలా కృషి చేయా లని కోరారు. తెలు గు భాషా సంరక్షణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీని యర్ లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ సంస్కృత భాషకు భారతీయ భాషా సంప్రదాయంలో విశిష్ట స్థానం ఉందన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థుల్లో భాషపై పట్టు, స్పష్టమైన ఉచ్చారణ, సాంస్కృతిక వారసత్వంపై అవగాహన, వేద ఇతిహాసాల పరిచయం, జ్ఞాపకశక్తి, ధారణ సామర్థ్యాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో శ్లోక పఠన పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. పోటీలను ప్రాథమిక, ఉన్నత పాఠశాల స్థాయిల్లో రెండు విభాగాలుగా నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల విభాగంలో 27 మంది విద్యార్థులు 10 శ్లోకాలు, హైస్కూల్ విభాగంలో 15 మంది విద్యార్థులు 20 శ్లోకాలు పఠించారు. భగవద్గీత శ్లోకాల శిక్షకురాలు శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి ఆదివారం శ్లోక ధారణ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు కోదండ రామాలయంలో తమను సంప్రదించాలని సూచించారు. పోటీల నిర్వహణలో బొమ్మకంటి కిషన్, లయన్ సంగోజు మనోహరాచారి, డాక్టర్ ఏ. గజేందర్ రెడ్డి, శాతవాహన లయన్స్ క్లబ్ కార్యదర్శి లయ న్ నార్ల వేణుగోపాల్, లయన్ సురేష్, వికాస తరంగిణి బా ధ్యులు రాజు రెడ్డి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు.






# 15 ఏళ్లకే కెప్టెన్‌గా వైభవ్!

**అగర్తల, ఆగస్టు 30 :**

**దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో భాగంగా సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న కీలక మ్యాచ్‌లో ఈస్ట్ జోన్‌కు అనూహ్య పరిస్థితి ఎదురైంది. జట్టు కెప్టెన్ ఇషాన్ కిషన్ గాయపడటంతో కేవలం 15 ఏళ్ల వయసున్న వైభవ్ సూర్యవంశీ తాత్కాలిక కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించాడు. దీంతో భారత దేశవాళీ క్రికెట్‌లో అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఇషాన్‌కు గాయం మ్యాచ్ జరుగు తున్న సమయంలో ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ గాయపడ్డాడు. దీంతో అతడు మైదానాన్ని వీడాల్సి వచ్చింది.**

జట్టుకు వైస్ కెప్టెన్‌గా ఉన్న వైభవ్ సూర్యవంశీ వెంటనే సారథ్య బాధ్యతలు చేపట్టాడు. కీలక సెమీఫైనల్ మ్యాచ్‌లో ఇంత చిన్న వయ సులోనే జట్టును నడిపించే అవకాశం వైభవ్‌కు దక్కడం ప్రత్యేకం గా నిలిచింది. కు సారథ్యం ఈస్ట్ జోన్ జట్టులో భారత జట్టు ప్రధాన పేసర్లు మహమ్మద్ షమీ, ముకేశ్ కుమార్ వంటి సీనియర్ ఆటగాళ్లు ఉ న్నారు. వారితో పాటు అనుభవజ్ఞులైన పలువురు ఆటగాళ్లను 15 ఏళ్ల వైభవ్ మైదానంలో నడిపించడం ఆసక్తికరంగా మారింది. యువ క్రికెటర్ నాయకత్వంలో సీనియర్ ఆటగాళ్లు ఆడటం దేశవాళీ క్రికెట్‌లో అరుదైన దృశ్యంగా అభిమానులను ఆకట్టుకుం ది. చిన్న వయసు లోనే సంచలనం వైభవ్ సూర్యవంశీ ఇప్పటికే తన దూకుడైన బ్యాటిం గ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. ఓపెనర్‌గా రాణిస్తున్న అతడు గత మ్యాచ్‌లో నార్త్ ఈస్ట్ జోన్‌పై మూడు ఓవర్లు బౌలింగ్ చేసి రెండు వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇప్పుడు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 15 ఏళ్లకే తాత్కాలిక కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టి మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకు న్నాడు.




## 2027 ప్రపంచకప్‌పై భారత్ ఫోకస్

### తిలక్ వర్మకు కీలక బాధ్యతలు?

**న్యూఢిల్లీ, ఆగస్టు 30 :**

2027 వన్డే ప్రపంచకప్‌కు భారత జట్టు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుం టోంది. ఈ నేపథ్యంలో మిడిల్ ఆర్డర్‌లో బ్యాకప్ ఆటగాడిగా యువ బ్యాటర్ తిలక్ వర్మను పరిగణిస్తున్నట్లు సమాచారం. ముఖ్యం గా నాలుగు ఓవర్లు బౌలింగ్ చేయగల సామ ర్థ్యం ఉన్న ఎడమచేతి వాటం బ్యాటర్ కోసం జట్టు యాజమాన్యం చూస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో తిలక్ వర్మ పేరు తెరపైకి వచ్చింది. తిలక్ ఎడమచేతి వాటం బ్యాటర్ కావడంతో భారత బ్యాటింగ్ ఆర్డర్‌లో వైవిధ్యం తీసుకు రాగలడని సెలెక్టర్లు భావిస్తున్నట్లు సమాచారం. అదే సమయంలో అతని ఆఫ్‌స్పిన్ బౌలింగ్‌ను మరింత మెరుగుపరుచుకోవాలని జట్టు యాజ మాన్యం సూచించినట్లు తెలుస్తోం ది. బ్యాటిం గ్‌తో పాటు అవసరమైన సమయం లో బౌ లింగ్ చేయగల ఆటగాడిగా అతడిని తీర్చిది ద్దాలనే ఆలోచన ఉన్నట్లు సమాచారం. అయ్య ర్‌కు ప్రత్యామ్నాయంగా తిలక్ టాప్ సిక్స్‌లో శ్రేయస్ అయ్యర్‌కు ప్రత్యామ్నాయంగా తిలక్ వర్మను సిద్ధం చేసే ఆలోచన జరుగుతున్నట్లు తెలుస్తోంది. హార్దిక్ పాండ్యా, నితీశ్ కుమార్ రెడ్డి వంటి ఆల్‌రౌండర్లు తరచూ గాయాల సమస్యలు ఎదుర్కొంటుండటంతో.. కనీసం నాలుగు ఓవర్లు బౌలింగ్ చేయగల బ్యాటర్ జట్టులో ఉండటం అవసరమని గంభీర్, గిల్ భావిస్తున్నట్లు సమాచారం. మిడిల్ ఆర్డర్‌కు సరై న బ్యాకప్ లేకపోవడం భారత జట్టుకు ఆందో ళనగా మారిందని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నట్లు తెలుస్తోంది. అందుకే ప్రపంచకప్‌కు ముందే ప్రత్యామ్నాయ ఆటగాళ్లను సిద్ధం చేయాలని జట్టు యాజమాన్యం భావిస్తున్నట్లు సమా చారం. మరి రుతురాజ్ పరిస్థితి ఏంటి? తిలక్ వర్మను బ్యాకప్‌గా పరిశీలిస్తున్నారన్న వార్తలతో రుతురాజ్ గైక్వాడ్ అంశం మరోసారి చర్చకు వచ్చింది. గతంలో నాలుగో స్థానంలో ఆడిన గైక్వాడ్.. దక్షిణాఫ్రికాపై రాయ్‌పూర్‌లో సెంచరీ చేసి తన సత్తా చాటాడు. అయినప్పటికీ ఆ ఇన్నింగ్స్ తర్వాత అతడికి వన్డే జట్టులో మళ్లీ స్థానం దక్కలేదు. అవకాశం లభించినప్పుడు సెంచరీ చేసిన గైక్వాడ్‌ను నాలుగో స్థానానికి బ్యాకప్‌గా ఎందుకు పరిగణించడం లేదని అభి మానులు ప్రశ్నిస్తున్నారు. అవసరమైన సమ యంలో పరుగులు చేసిన ఆటగాడిని పక్కన పెట్టడం సరైన నిర్ణయమేనా అంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. యువ బ్యాకప్‌లపై భారత్ దృష్టి 2027 ప్రపంచకప్ దక్షిణాఫ్రికాలో జరగనున్న నేపథ్యంలో అక్కడి పేస్, బౌన్స్‌కు అనుగుణంగా యువ ఆటగా ళ్లను సిద్ధం చేయాలని భారత జట్టు భావిస్తు న్నట్లు సమాచారం. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్ ఆటగాళ్లతో పాటు కేఎల్ రాహుల్ కూడా అప్పటికి 35 ఏళ్లు దాటే అవకాశం ఉంది. రవీంద్ర జడేజా భవిష్యత్తు కూడా అప్పటికి స్పష్టంగా ఉండకపోవచ్చు.

# పాంటింగ్ రికార్డు బద్దలు కొట్టిన జో రూట్!

**లండన్, ఆగస్టు 30 :**

ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ మరోసారి టెస్టు క్రికెట్‌లో తన పేరును రికార్డు పుస్తకాల్లో లిఖించుకున్నాడు. పాకిస్థాన్‌తో లార్డ్స్‌లో జరుగు తున్న రెండో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 24 పరుగులు చేసిన రూట్.. సొంతగడ్డపై అత్యధిక టెస్టు పరుగులు చేసిన బ్యాటర్‌గా అవతరిం చాడు. ఈ క్రమంలో ఆస్ట్రేలియా దిగ్గజం రికీ పాంటింగ్ పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టాడు. రూట్ ఇంగ్లండ్ గడ్డపై ఇప్పటివరకు 89 టెస్టులు ఆడి 156 ఇన్నింగ్స్‌ల్లో 7,594 పరుగులు సాధించాడు. పాంటింగ్ ఆస్ట్రేలియా గడ్డపై 7,578 పరుగులు చేశాడు. దీంతో రూట్ 24 పరుగుల ఇన్నింగ్స్‌తో పాంటింగ్‌ను అధిగమించి అగ్రస్థానంలో నిలిచాడు. సచిన్ రికార్డుపై గురి టెస్టు క్రికెట్‌లో అత్యధిక పరుగు లు చేసిన బ్యాటర్ల జాబితాలో ప్రస్తుతం సచిన్ టెండూల్కర్ 15,921 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నాడు. రూట్ 168 టెస్టుల్లో 14,208 పరుగులు చేశాడు. సచిన్ రికార్డును అధిగ మించాలంటే రూట్ ఇంకా 1,713 పరుగులు చేయాల్సి ఉంది. సొంతగడ్డపై అత్యధిక టెస్టు పరుగులు చేసిన బ్యాటర్లలో రూట్ 7,594 పరుగులతో తొలి స్థానంలో ఉండగా.. రికీ పాంటింగ్ 7,578 పరుగులతో రెండో స్థానంలో ఉన్నాడు. సచిన్ టెండూల్కర్ 7,216 పరుగుల తో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు.




# ఐపీఎల్ పాలక మండలికి ఎన్నికల సందడి

### సెప్టెంబర్ 18న ఎన్నికలు.. మరోసారి బరిలో అరుణ్ సింగ్ ధుమాల్

**ముంబై, ఆగస్టు 30 :**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ పాలక మండలిలో రెండు కీలక పదవుల భర్తీకి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి ఎన్నికల అధికారి ఏకే జోతి శనివారం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. సెప్టెంబర్ 18న జరిగే బీసీసీఐ వార్షిక సమావేశంలో ఈ రెండు పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాలక మండలిలోని నలుగురు సభ్యుల్లో ఇద్దరి ని వార్షిక సమావేశం ద్వారా ఎన్నుకునే నిబంధన ఉ ంది. ధుమాల్ మరోసారి బరిలో.. ప్రస్తుతం ఐపీఎల్ ఛైర్మన్‌గా కొనసాగుతున్న అరుణ్ సింగ్ ధుమాల్ మరో సారి ఎన్నికల బరిలో నిలవనున్నారు. హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ సంఘానికి చెందిన ధుమాల్‌తో పాటు మిజోరాం క్రికెట్ సంఘానికి చెందిన ఖైరుల్ జమాల్ మజుందార్ కూడా మరోసారి పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది ఎన్నికైన వీరిద్దరి పదవీకాలం ముగియడంతో నిబంధనల ప్రకారం తిరిగి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ధుమాల్ మరోసారి ఎన్నిక కావడం దాదాపు ఖాయమని క్రికెట్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సెప్టెంబర్ 9, 10న నామినేషన్లు ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ధుమాల్, మజుందార్‌లు సెప్టెంబర్ 9 లేదా 10వ తేదీన నామినేషన్లు దాఖలు చేయనున్నారు.



# మెస్సీ అభిమానులకు బిగ్ రిలీఫ్

**కోల్‌కతా, ఆగస్టు 30 :**

కోల్‌కతాలో ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ కార్యక్రమానికి హాజరై నిరాశకు గురైన అభిమానులకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఊరటనిచ్చింది. గతేడాది గందరగోళం మధ్య జరిగిన ఈ కార్యక్రమానికి టికెట్లు కొనుగోలు చేసిన సుమారు 33,000 మంది అభిమానులకు టికెట్ డబ్బులను తిరిగి చెల్లించనున్నట్లు ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రకటించారు.

**రూ.4 వేల నుంచి రూ.6 వేల టికెట్లు**

డిసెంబర్ 13న కోల్‌కతాలోని యువభారతి స్టేడియంలో జరిగిన మెస్సీ కార్యక్రమంలో నిర్వహణ లోపాల కారణంగా అభిమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రూ.4,000 నుంచి రూ.6,000 వరకు విలువైన టికెట్లు కొనుగోలు చేసిన అభిమానులకు రీఫండ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. క్రీడా బడ్జెట్ నుంచి రీఫండ్ సుమారు 33,000 మంది అభిమానుల టికెట్ డబ్బులను రాష్ట్ర క్రీడా బడ్జెట్ నుంచి తిరిగి చెల్లించే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైనట్లు సీఎం తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నబన్నాలో జరిగిన కార్యక్రమంలో ఈ విషయాన్ని వెల్లడించారు. క్రీడల అభివృద్ధికి రూ.400 కోట్లు పశ్చిమ బెంగాల్‌లో క్రీడారంగ అభివృద్ధికి రూ.400 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మినీ ఇండోర్ స్టేడియంలను నిర్మిస్తామని, క్రీడా మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చింది.



# లార్డ్స్‌లో పాక్ పేస్ పంజా




**లండన్, ఆగస్టు 30 :**

లార్డ్స్ వేదికగా జరుగుతున్న టెస్టు మ్యాచ్ రసవత్తరంగా మారింది. నాలుగో రోజు తొలి సెషన్‌లోనే ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 208 పరుగులకు ఆలౌటైంది. పాకిస్థాన్ పేసర్ మొహమ్మద్ అబ్బాస్ అద్భుత బౌలింగ్‌తో ఐదు వికెట్లు పడగొట్టి ఇంగ్లండ్ బ్యాటింగ్ పతనాన్ని శాసించాడు. దీంతో పాకిస్థాన్ విజయానికి 389 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ నిర్దేశించింది. అబ్బాస్ విజృంభణ తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లం డ్‌కు ఆధిక్యం లభించినప్పటికీ రెండో ఇన్నింగ్స్‌లో పాక్ పేసర్లను ఎదుర్కోలేక ఆతిథ్య జట్టు తడబడింది. అబ్బాస్ 57 పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. అతడికి పాక్ పేస ర్లు చక్కటి సహకారం అందించడంతో ఇంగ్లండ్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్ చేరారు. చివర్లో ఓలీ రాబిన్సన్‌ను ఔట్ చేయడం ద్వారా అబ్బాస్ ఐదు వికెట్ల ఘనతను నమోదు చేశాడు. లారెన్స్ పోరాటం

ఇంగ్లండ్ తరఫున డాన్ లారెన్స్ 54 పరుగులతో అర్ధశతకం సాధించి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. హ్యారీ బ్రూక్ 34 పరుగులతో కొంతసేపు పాక్ బౌలర్లను అడ్డుకున్నాడు. అయితే లారెన్స్‌ను అబ్బాస్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లండ్ పతనం వేగం పుంజుకుంది. మిగతా బ్యాటర్లు ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. పాక్ బ్యాటర్లపై ఒత్తిడి 389 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన పాకిస్థాన్‌కు అసలు పరీక్ష ఇప్పుడు మొదలైంది. తొలి ఇన్నింగ్స్‌లో పాక్ బ్యాటర్లు విఫలమైన నేపథ్యంలో ఈసారి పటిష్టమైన ఇంగ్లండ్ పేస్ దళాన్ని ఎలా ఎదుర్కొంటారన్నది ఆసక్తికరంగా మారింది. పాక్ బ్యాటర్లు వికెట్లు కాపాడుకుంటూ భారీ భాగస్వామ్యాలు నెలకొల్పితే మ్యాచ్‌లో విజయం సాధించే అవకాశాలు ఉంటాయి. మరోవైపు ఇంగ్లండ్ బౌలర్లు త్వరగా వికెట్లు తీస్తే మ్యాచ్ ఆతిథ్య జట్టు వైపు మొగ్గే అవకాశం ఉంది.



# యే జవానీ హై దీవానీ'కి అరుదైన గౌరవం

హైదరాబాద్, ఆగస్టు 30 :

బాలీవుడ్ దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన కల్ట్ హిట్ చిత్రం 'యే జవానీ హై దీవానీ' మరోసారి వార్తల్లో నిలిచింది. రణ్‌బీర్ కపూర్, దీపికా పదుకొణె జంటగా నటించిన ఈ చిత్రంలోని 'నైనా తల్వార్' పాత్రకు ప్రతిష్ఠాత్మక ది అకాడమీ నుంచి ప్రత్యేక గుర్తింపు లభించింది. అకాడమీ ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రత్యేక సీన్ అకాడమీ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో 'యే జవానీ హై దీవానీ'లోని ఓ ప్రత్యేక సన్నివేశాన్ని పంచుకుంది. ఉదయపూర్‌లో అదితి వివాహ వేడుకకు ముందు వచ్చే సూర్యాస్తమయ సన్నివేశాన్ని షేర్ చేస్తూ.. నైనా పాత్రకు సంబంధించిన భావోద్వేగాన్ని ప్రస్తావించింది. 'క్షణాన్ని ఆస్వాదించాలి'.. నైనా సందేశం ఈ సన్నివేశంలో బన్నీగా నటించిన రణ్‌బీర్ కపూర్‌తో నైనా మాట్లాడుతుంది. జీవితంలో ఎప్పుడూ పరుగులు పెట్టడం కంటే, కొన్ని సందర్భాల్లో ఉన్న చోటే ఆగి ఆ క్షణాన్ని ఆస్వాదించడం ముఖ్యమని ఆమె చెప్పే విధానం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ భావోద్వేగ సన్నివేశాన్ని అకాడమీ ప్రత్యేకంగా గుర్తించడం అభిమానులను ఆనందంలో ముంచెత్తింది. సోషల్ మీడియాలో అభిమానుల సందడి అకాడమీ పోస్ట్‌పై అభిమానులు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. ఈ సినిమా తమ హృదయాల్లో ఎప్పటికీ ప్రత్యేకంగా ఉంటుందని పలువురు కామెంట్లు చేస్తున్నారు.




# 'కొరియన్ కనకరాజు' ఓటీటీకి

హైదరాబాద్, ఆగస్టు 30 :

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కలయికలో తెరకెక్కిన హారర్ కామెడీ చిత్రం 'కొరియన్ కనకరాజు' డిజిటల్ ప్రసారానికి సిద్ధమవుతోంది. థియేటర్లలో ప్రేక్షకులను అలరించిన ఈ సినిమా సెప్టెంబర్ 4, 2026 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానున్నట్లు సమాచారం. దీనిపై చిత్రబృందం అధికారిక ప్రకటన త్వరలోనే చేయనున్నట్లు తెలుస్తోంది. రితికా నాయక్ కథానాయిక ఈ చిత్రంలో వరుణ్ తేజ్‌కు జోడీగా రితికా నాయక్ నటించగా, సత్య కామెడీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. తమన్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, యూవీ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. తెలుగు సహా ఇతర ప్రధాన భాషల్లోనూ ఈ సినిమా అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. ఆత్మ చుట్టూ ఆసక్తికర కథ అనంతపురం జిల్లా పెనుగొండకు చెందిన కనకరాజు చెక్కభజన ప్రదర్శనలు చేస్తూ సరదాగా జీవిస్తుంటాడు. కియా కర్మాగారంలో పనిచేసే చైత్రను ప్రేమిస్తాడు.

# 'రంభ ఊర్వశి మేనక'కు సెన్సార్ చిక్కులు

హైదరాబాద్, ఆగస్టు 30 :




టాలీవుడ్‌లో సెన్సార్ నిబంధనలు నిర్మాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. విడుదలకు ముందు సెన్సార్ నుంచి వస్తున్న అభ్యంతరాలతో పలువురు నిర్మాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అల్లరి నరేష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'రంభ ఊర్వశి మేనక' కూడా సెన్సార్ అడ్డంకులను ఎదుర్కొం టున్నట్లు సమాచారం. గ్లామర్ దుస్తులపై సెన్సార్ అభ్యంతరం ఈ సినిమాలో రంభ, ఊర్వశి, మేనక పాత్రలు ధరించిన దుస్తులపై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఆయా పాత్రలను గ్లామరస్‌గా కాకుండా సంప్రదాయ చీరల్లో చూపించాలని అధికారులు సూచించినట్లు సమాచారం. ఈ సమస్య పరిష్కారం కాకపోతే చిత్ర బృందం రివైజింగ్ కమిటీని ఆశ్రయించే అవకాశం ఉంది. 'ది 418'కు కూడా సెన్సార్ సమస్యలు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొన్న సినిమాల్లో 'ది 418' కూడా ఉంది. మైత్రీ మూవీ మేకర్స్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కిన ఈ చిత్రం జూలైలో విడుదల కావాల్సి ఉండగా.. హారర్ మోతాదు ఎక్కువగా ఉందనే కారణంతో వాయిదా పడినట్లు సమాచారం. దీంతో చిత్ర బృందం రివైజింగ్ కమిటీని సంప్రదించినట్లు తెలుస్తోంది. టైటిల్స్ మార్పుపైనా నిర్మాతల ఆందోళన 'కొరియన్ కనకరాజు' సినిమా విషయంలోనూ కొన్ని సన్నివేశాలపై సెన్సార్ సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు సమాచారం.



# అనుష్క తొలి ప్రేమ జ్ఞాపకం

హైదరాబాద్, ఆగస్టు 30 :

దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనదైన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అనుష్క శెట్టి.. తన చిన్ననాటి తొలి ప్రేమ జ్ఞాపకాన్ని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. తాను ఆరో తరగతి చదువుతున్న సమయంలో ఓ అబ్బాయి తనకు నేరుగా 'ఐ లవ్ యు' చెప్పాడని అనుష్క గుర్తుచేసుకున్నారు. ఆ వయసులో 'ఐ లవ్ యు' అంటే ఏమిటో కూడా తనకు తెలియదని, అందుకే అమాయకంగా 'సరే' అని సమాధానం ఇచ్చానని నవ్వుతూ చెప్పారు. ఆ సంఘటన తన జీవితంలో అత్యం త అమాయకమైన, అందమైన జ్ఞాపకంగా మిగిలిపో యిందని తెలిపారు. పెళ్లిపై అనుష్క ఏమన్నారంటే? నలభై ఏళ్లు దాటినా పెళ్లి చేసుకోకపోవడంతో అనుష్క వ్యక్తిగత జీవితంపై తరచూ పుకార్లు వస్తుంటాయి. అయితే సరైన వ్యక్తి ఎదురైనప్పుడు సహజంగానే పెళ్లి జరుగు తుందని ఆమె గతంలో పేర్కొన్నారు. తన వివాహ విషయాన్ని తల్లిదండ్రులకే వదిలేశానని, పెళ్లి కుదిరిన రోజున అందరికీ బహిరంగంగా తెలియజేస్తానని స్పష్టం చేశారు. నటనతో ప్రత్యేక గుర్తింపు సినిమా రంగంలోకి రాకముందు ముంబైలో యోగా శిక్షకురాలిగా పనిచేసిన అనుష్క.. 'సూపర్' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమయ్యారు. 'అరుంధతి', 'బాహుబలి', 'రుద్రమ దేవి', 'భాగమతి' వంటి చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. వ్యక్తిగత విషయాలను గోప్యంగా ఉంచే అనుష్క.. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లకు దూరంగా ఉంటారు.

# మహిళల చిత్రీకరణపై మోనాలిసా



ముంబై, ఆగస్టు 30 :

సినిమాల్లో కథానాయికలను వస్తువులుగా చూపించడంపై జరుగుతున్న చర్చకు ప్రముఖ భోజ్‌పురి నటి మోనాలిసా స్పందించారు. తెరపై చర్మ ప్రదర్శన కంటే దాన్ని ఎలా చిత్రీకరిస్తున్నారన్నదే ముఖ్యమని ఆమె అభిప్రాయపడ్డారు. హిందీ సినిమాల్లోనూ చర్మ ప్రదర్శన ఉంటుందని, అయితే దాన్ని కళాత్మకంగా, అందంగా చూపించడం వల్ల ప్రేక్షకులకు అసభ్యంగా అనిపించకపోవచ్చని మోనాలిసా అన్నారు. ప్రాంతీయ చిత్రాల్లో, ముఖ్యంగా భోజ్‌పురి సినిమాల్లో కొన్నిసార్లు ఇలాంటి సౌందర్యాత్మక చిత్రీకరణ లోపిస్తుందని పేర్కొన్నారు. ప్రజెంటేషన్ చాలా ముఖ్యం నడుము లేదా ఇతర శరీర భాగాలను చూపించే సన్నివేశాలను కూడా అందంగా, కళాత్మకంగా చిత్రీకరిస్తే ప్రేక్షకులపై ప్రభావం భిన్నంగా ఉంటుందని ఆమె తెలిపారు. మహిళా పాత్రలను తెరపై చూపించే విధానానికి ఎంతో ప్రాధాన్యం ఉందని మోనాలిసా స్పష్టం చేశారు. 'పెద్ది'పై చర్చ నేపథ్యంలో ఇటీవల రామ్‌చరణ్, జాన్వీ కపూర్ జంటగా నటించిన 'పెద్ది'లోని కొన్ని సన్నివేశాలపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వచ్చిన నేపథ్యంలో మోనాలిసా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కథానాయికను అతిగా శృంగారభరితంగా చూపించారంటూ కొందరు విమర్శలు వ్యక్తం చేశారు.

# ఇరుముడి దూకుడు..

## సెకండ్ వీకెండ్‌లోనూ భారీ వసూళ్లు




హైదరాబాద్, ఆగస్టు 30 :

మాస్ మహారాజా రవితేజ హీరోగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఇరుముడి' చిత్రం బాక్సాఫీస్ వద్ద దూకుడు కొనసాగిస్తోంది. విడుదలైన నాటి నుంచి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అంద ుకుంటున్న ఈ సినిమా సెకండ్ వీకెండ్‌లోనూ జోరు తగ్గించకుండా దూసుకుపోతోంది. సాధారణంగా రెండో వారంలో సినిమాల వసూళు ఆక్యుపెన్సీ తగ్గుతుంటాయి. కానీ 'ఇరుముడి'కి మాత్రం భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. రెండో ఆదివారం ఉదయం నుంచే ఆన్‌లైన్ టికెట్ బుకింగ్స్‌లో భారీ డిమాండ్ కనిపించింది. ప్రముఖ టికెటింగ్ వేదికలో గంటకు 20 వేలకుపైగా టికెట్లు అమ్ముడవుతున్నట్లు సమాచారం. విడుదలైన నాలుగు రోజుల్లోనే రూ.100 కోట్ల నెట్ మార్క్‌ను దాటిన ఈ చిత్రం.. తొమ్మిది రోజుల థియేట్రికల్ రన్‌లో ప్రపంచవ్యాప్తంగా రూ.150 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు తెలుస్తోంది. మల్టీప్లెక్స్‌లు, సింగిల్ స్క్రీన్లలోనూ ఆక్యుపెన్సీ పెరుగుతుండటంతో లాంగ్ రన్‌లో మరిన్ని రికార్డులు నమోదయ్యే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సినిమాలోని కథ, భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాలు, భక్తి అంశాలను కమర్షియల్ హంగులతో మేళవించిన శివ నిర్వాణ శైలి ప్రేక్షకులను ఆకట్టుకుంటోందని చెబుతున్నారు. స్టార్ హీరో ఇమేజ్‌తో పాటు బలమైన కంటెంట్ సినిమాకు విజయాన్ని అందించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948**, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467